# నవజ్యోతి
తెలుగు దినపత్రిక

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 01 సంచిక : 250 | ఎడిటర్.: మన్నే లక్ష్మణ్ | వెల:5/- | పేజీలు: 8 | ఆదివారం 28-06-2026


## చక్రిపురం చౌరస్తాలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ



- రోడ్డు పాలవుతున్న మంచినీరు – వెంటనే మరమ్మతులు చేపట్టాలని కాలనీ కమిటీల సమాఖ్య విజ్ఞప్తి

6

## గుంతల రోడ్లపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ స్పందన

- ప్రజల ప్రాణాలు కాపాడేందుకే ఈ చర్య అంటూ నాయకుల వెల్లడి
- పదవుల్లో ఉండటం నాయకత్వం కాదు...



6

# ఫ్లాట్ ఆలస్యమైతే.. బిల్డర్ చెల్లించాల్సిందే!

- గృహ కొనుగోలుదారుల హక్కులపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- ఫ్లాట్ స్వీకరించినా నష్టపరిహారం కోరే హక్కు ఉంటుందని స్పష్టీకరణ
- పెట్టుబడిదారుల రక్షణ చట్టానికే ప్రాధాన్యం.. ఏడాదిలోగా కేసు పరిష్కరించాలని ఆదేశం

2



## దివ్యాంగులకు మరింత అండ




- 14 కేంద్రాలకు ఈ-ఆటోల పంపిణీ
- సమాన అవకాశాలే ప్రభుత్వ లక్ష్యం
- హెలెన్ కెల్లర్‌కు ఘన నివాళి
- మంత్రి సీతక్క

2



# జల ఒప్పందంపై హరీశ్ విమర్శలు

- సీఎం తీరుపై తీవ్ర ఆరోపణలు
- తెలంగాణ హక్కులు కాపాడాలన్న డిమాండ్
- రహస్య ఒప్పందం వివరాలు వెల్లడించాలి

**హైదరాబాద్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ జల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తుంగభద్ర గేట్ల ప్రారంభోత్సవం సందర్భంగా మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర జల హక్కులకు భంగం కలిగించే ఎలాంటి నిర్ణయాన్నీ అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర నదిపై 35 టీఎంసీల సామర్థ్యంతో నవేలి రిజర్వాయర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల ప్రాజెక్టు చేపట్టాలని ప్రయత్నిస్తున్నాయని అన్నారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా మొత్తం 55 టీఎంసీల నీటిని నిల్వ చేయడం వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

మిగతా 2 లో..

## బ్రహ్మోస్ యూనిట్‌కు సీఎం కృతజ్ఞతలు

### సీఎంను కలిసిన ఎమ్మెల్యే

- ఉపాధి అవకాశాలపై ఆశలు
- మౌలిక వసతులు వేగవంతం చేయాలి

**హైదరాబాద్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

దేవరకద్ర నియోజకవర్గంలో ప్రతిపాదిత బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్ ఏర్పాటుకు సహకరించినందుకు ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల తరఫున సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి ప్రాజెక్టు ఏర్పాటుపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ పరిశ్రమతో మహబూబ్‌నగర్ ప్రాంత అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్ ఏర్పాటు వల్ల స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని తెలిపారు.

మిగతా 2 లో..





## ఆర్టీసీ హామీలన్నీ అమలు చేస్తాం

- కార్మికులకు మంత్రి భరోసా
- పీఆర్సీ జూలై నుంచే అమలు
- గుర్తింపు ఎన్నికలు త్వరలోనే

2

## సౌదీ ప్రయాణికులకు కొత్త నిబంధనలు



- డిక్లరేషన్ పరిమితి తగ్గింపు
- బంగారం రవాణాపై కఠిన నిబంధనలు
- ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు

2

## ఎంఎస్ఎంఈలతోనే ఆర్థికాభివృద్ధి



- యువ పారిశ్రామిక వేత్తలే కీలకం
- ఉపాధి కల్పనపై దృష్టి
- ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవంలో టీపీసీసీ చీఫ్

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటివని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

మిగతా2లో..



## 73 అంగన్వాడీ పోస్టుల భర్తీ

- దరఖాస్తులకు నోటిఫికేషన్ విడుదల
- జూన్ 29 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మహిళా అభ్యర్థులకు అవకాశం
- ఆన్‌లైన్ దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి

2

## ఎస్బీఐతో వివాదానికి పరిష్కారం



2

- ప్రభుత్వ ప్రతిపాదనలకు అంగీకారం
- ప్రత్యామ్నాయ భూములపై సానుకూలత
- చట్టపరంగా ప్రక్రియ పూర్తి

రాయదుర్గం భూముల వివాద పరిష్కార దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది.

## హస్మత్‌పేటలో హైడ్రా భారీ ఆపరేషన్

### 10 ఎకరాల ప్రభుత్వ భూమి రక్షణ




2




## మహిళా రిజర్వేషన్లపై కవిత పిలుపు

- ఢిల్లీలో భారీ సభ నిర్వహిద్దాం
- మహిళా బిల్లు అమలు చేయాలి

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్

2

# బ్రహ్మోస్ యూనిట్‌కు సీఎం కృతజ్ఞతలు

**మొదటిపేజీ తరువాయి**

పరిశ్రమల అభివృద్ధితో పాటు అనుబంధ రంగాల్లో కూడా ఉద్యోగాలు పెరుగుతాయని, ప్రాంత ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారుతుందని చెప్పారు. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు రహదారులు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ముఖ్యమంత్రిని కోరారు. ప్రాజెక్టు పనులు ఆలస్యం కాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ప్రాజెక్టు అమలుకు అవసరమైన చర్యలు వేగంగా చేపట్టి, నిర్ణీత గడువులోగా అన్ని ప్రక్రియలు పూర్తి చేసేలా అధికారులకు తగిన సూచనలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్ ఏర్పాటు వల్ల దేవరకద్రతో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.<

# ఎస్బీఐతో వివాదానికి పరిష్కారం

**హైదరాబాద్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన సచివాలయంలో తెలంగాణ ప్రభుత్వం, ఎస్‌బీఐ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా ముగిశాయి. వివాదాస్పద భూమికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం సూచించిన ప్రాంతాలపై ఎస్‌బీఐ సానుకూలంగా స్పందించింది. రాయదుర్గం భూమికి బదులుగా ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ స్థలాలను ఎస్‌బీఐ ప్రతినిధులు పరిశీలించారు. ఆ ప్రాంతాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రభుత్వ ప్రతిపాదనలకు ఎస్‌బీఐ అంగీకారం తెలిపింది. దీంతో ఇరుపక్షాల మధ్య నెలకొన్న వివాదం పరిష్కార దిశగా కీలక పురోగతి నమోదైంది. ప్రత్యామ్నాయ భూముల కేటాయింపుపై ఎస్‌బీఐ బోర్డు ఆమోదం తీసుకునే ప్రక్రియ చేపట్టనున్నట్లు సమావేశంలో చర్చించారు. అలాగే కోర్టు విచారణలకు అనుగుణంగా అవసరమైన చర్యలు కొనసాగించాలని నిర్ణయించారు. అన్ని చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ ప్రక్రియను పూర్తి చేయాలని ఇరువర్గాలు అంగీకరించాయి. అవసరమైన పరిపాలనా, చట్టపరమైన లాంఛనాలు పూర్తయిన వెంటనే ఒప్పంద అమలు దిశగా చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ సమావేశం ద్వారా ప్రభుత్వానికి, ఎస్‌బీఐకి మధ్య నెలకొన్న భూవివాదానికి సామరస్యపూర్వక పరిష్కారం లభించే అవకాశాలు మరింత బలపడ్డాయి. పరస్పర అవగాహనతో చర్చలు జరగడం వల్ల వివాదాన్ని త్వరితగతిన ముగించే పరిస్థితులు ఏర్పడ్డాయని అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు, చట్టపరమైన నిబంధనలు, సంస్థాగత అవసరాలను సమన్వయం చేస్తూ ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు పేర్కొన్నారు. బోర్డు ఆమోదం, కోర్టు ప్రక్రియలు పూర్తైన అనంతరం ఇరుపక్షాలు కలిసి తుది చర్యలు చేపట్టి వివాదాన్ని శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు.

# 73 అంగన్వాడీ పోస్టుల భర్తీ

**జోగులాంబ గద్వాల, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

జోగులాంబ గద్వాల జిల్లాలో ఖాళీగా ఉన్న 73 అంగన్వాడీ పోస్టుల భర్తీకి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలోని మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 64 అంగన్వాడీ టీచర్ పోస్టులు, 9 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించారు. జిల్లా కలెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం గద్వాల అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టులో 28 అంగన్వాడీ టీచర్ పోస్టులు, 5 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులు కలిపి 33 ఖాళీలు ఉన్నాయి. మల్దకల్ ప్రాజెక్టులో 22 అంగన్వాడీ టీచర్ పోస్టులు, 4 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులు కలిపి 26 పోస్టులు ఉన్నాయి. మానవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టులో 14 అంగన్వాడీ టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నారు.ఈ నియామకాల కోసం జూన్ 29 నుంచి జూలై 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. నిర్ణీత గడువులోపు సమర్పించిన ఆన్‌లైన్ దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. గడువు అనంతరం వచ్చిన దరఖాస్తులను స్వీకరించబోమని పేర్కొన్నారు. అర్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్ నిబంధనలు, పోస్టుల వారీ వివరాలు, దరఖాస్తు విధానం తదితర సమాచారం కోసం మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు నోటిఫికేషన్‌ను పూర్తిగా చదివి, అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.నియామక ప్రక్రియ పూర్తిగా నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించబడుతుందని అధికారులు పేర్కొన్నారు. అవసరమైతే ఈ నియామక ప్రక్రియను ఏ దశలోనైనా రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుందని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. జిల్లాలోని అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ నియామకాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

# మహిళా రిజర్వేషన్లపై కవిత పిలుపు

**హైదరాబాద్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

హిమాయత్‌నగర్‌లో ఎన్‌సీఆర్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో నిర్వహించిన "చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల సాధన సభ"లో పాల్గొని ఆమె ప్రసంగించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయించేందుకు దేశవ్యాప్తంగా మహిళలు ఏకమై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ సభ నిర్వహించాలని ప్రతిపాదించారు. మహిళల శక్తిని దేశానికి చాటిచెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. బిల్లు అమలు చేయకపోతే మహిళలంతా ఓటుతో తమ నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో మహిళలు కీలక స్థానాల్లో ఉన్నప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని కవిత పేర్కొన్నారు. అందుకే మహిళలకు చట్టబద్ధంగా 33 శాతం రాజకీయ రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. మహిళా నాయకత్వాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి కొత్త తరం మహిళా నాయకులను తయారు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం గతంలో జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలు నిర్వహించామని, పలు రాజకీయ పార్టీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చామని కవిత గుర్తు చేశారు. బిల్లుకు ఆమోదం లభించినప్పటికీ ఇప్పటికీ అమలులోకి తీసుకురాకపోవడం విచారకరమన్నారు. మహిళలతో పాటు బీసీ, మైనార్టీ వర్గాల ప్రాతినిధ్యం కూడా పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మహిళలకు చట్టపరమైన రిజర్వేషన్లు కల్పిస్తేనే రాజకీయాల్లో సమాన అవకాశాలు లభిస్తాయని కవిత స్పష్టం చేశారు. మహిళల సాధికారత కోసం తాను ప్రారంభించిన రాజకీయ వేదిక ద్వారా నిరంతరం పోరాడతానని చెప్పారు. మహిళల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ప్రజాక్షేత్రంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆమె ప్రకటించారు.

# ఫ్లాట్ ఆలస్యమైతే.. బిల్డర్ చెల్లించాల్సిందే!

**న్యూఢిల్లీ, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

దేశవ్యాప్తంగా లక్షలాది మంది గృహ కొనుగోలుదారులకు ఊరటనిచ్చే కీలక తీర్పును సుప్రీంకోర్టు వెలువరించింది. ఫ్లాట్ నిర్మాణం లేదా అప్పగింతలో బిల్డర్ జాప్యం చేస్తే, అనంతరం కొనుగోలుదారు ఫ్లాట్‌ను స్వీకరించినప్పటికీ ఆ ఆలస్యానికి సంబంధించిన నష్టపరిహారం కోరే హక్కు కోల్పోరని స్పష్టంగా తేల్చిచెప్పింది. ఫ్లాట్‌ను స్వాధీనం చేసుకోవడం అంటే బిల్డర్ చేసిన జాప్యాన్ని అంగీకరించినట్లుగా భావించరాదని పేర్కొంది. ఈ తీర్పు రియల్ ఎస్టేట్ రంగంలో వినియోగదారుల హక్కులను మరింత బలోపేతం చేసే నిర్ణయంగా నిలిచింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. 2016లో జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఇచ్చిన నిర్ణయాన్ని పక్కనపెట్టి, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసును పునర్విచారణకు స్వీకరించింది. నిర్మాణ జాప్యం వల్ల కొనుగోలుదారుడు అనుభవించిన ఇబ్బందులకు పరిహారం చెల్లించే బాధ్యత బిల్డర్‌పైనే ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఫ్లాట్ అప్పగింత అనంతరం కూడా ఆ హక్కు కొనసాగుతుందని, వినియోగదారులు తమ చట్టబద్ధమైన హక్కులను కోల్పోరని పేర్కొంది. ఈ తీర్పు ఢిల్లీకి చెందిన టీకేపీ పద్మనాభన్ దాఖలు చేసిన కేసు విచారణ సందర్భంగా వెలువడింది. ఆయన 2005లో అభియాన్ కోఆపరేటివ్ గ్రూప్ హౌసింగ్ సొసైటీపై ఫ్లాట్ అప్పగింతలో తీవ్ర జాప్యం జరిగిందని ఆరోపిస్తూ వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. అయితే ఒప్పందంలో ఉన్న మధ్యవర్తిత్వ నిబంధనను ఆధారంగా తీసుకుని కింది కోర్టులు కేసును ఆర్బిట్రేషన్‌కు పంపించాయి. దీనిని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా, అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఒప్పందంలో మధ్యవర్తిత్వ నిబంధన ఉందనే కారణంతో వినియోగదారుల ఫోరంను ఆశ్రయించే హక్కును నిరాకరించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వినియోగదారుల రక్షణ చట్టం–1986 ప్రత్యేక చట్టమని, ఇది ప్రజలకు అదనపు న్యాయరక్షణ కల్పిస్తుందని పేర్కొంది. ప్రైవేటు ఒప్పందాలు లేదా మధ్యవర్తిత్వ నిబంధనలు వినియోగదారుల చట్టబద్ధ హక్కులను హరించలేవని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ వ్యాఖ్యలు భవిష్యత్తులో ఇలాంటి కేసులకు మార్గదర్శకంగా నిలవనున్నాయి. ఈ కేసును తిరిగి ద్వారక జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార ఫోరంకు పంపించిన సుప్రీంకోర్టు, విచారణను ఏడాది లోపే పూర్తి చేయాలని ఆదేశించింది. కేసు విచారణలో నిర్మాణ జాప్యం వల్ల కొనుగోలుదారుడు ఎదుర్కొన్న ఆర్థిక, మానసిక నష్టాలను కూడా పరిగణనలోకి తీసుకుని చట్టప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించింది. దీంతో బాధితులకు వేగంగా న్యాయం అందే అవకాశాలు మరింత పెరిగాయి. సుప్రీంకోర్టు తాజా తీర్పు దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం చూపనుంది. నిర్మాణ సంస్థలు నిర్ణీత గడువులో ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన బాధ్యతను ఇది మరింత స్పష్టం చేసింది. ఇకపై ఫ్లాట్ ఆలస్యంగా అప్పగించినా, కొనుగోలుదారులు దానిని స్వీకరించారని చెప్పి బిల్డర్లు బాధ్యత నుంచి తప్పించుకోలేరు. జాప్యం వల్ల కలిగిన నష్టానికి పరిహారం చెల్లించాల్సిందేనని అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు గృహ కొనుగోలుదారుల హక్కులకు బలమైన భరోసాగా నిలిచింది.

# మహిళల సాధికారతకు సమిష్టి కృషి అవసరం

**మొదటిపేజీ తరువాయి**

ఈ ప్రాజెక్టులు పూర్తయితే శ్రీశైలం జలాశయానికి వచ్చే నీటి ప్రవాహం తగ్గి రాష్ట్రంలోని పలు సాగునీటి పథకాలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రుల సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి, రాష్ట్ర ఇంజినీర్లను లోపలికి అనుమతించకుండా బయటే ఉంచారని హరీశ్‌రావు ఆరోపించారు. ముగ్గురు ముఖ్యమంత్రులు, కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి మాత్రమే పాల్గొన్న సమావేశంలో ఎలాంటి చర్చలు జరిగాయో రాష్ట్ర ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. రహస్యంగా కుదిరినట్లు చెబుతున్న ఒప్పందం వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ గుండ్రేవుల ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకించి నిలిపివేశామని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు మళ్లీ తెరపైకి రావడానికి రాష్ట్ర ప్రభుత్వ వైఖరే కారణమని ఆరోపించారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాను సాధించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తుంగభద్ర నదిపై కర్ణాటక చేపడుతున్న పలు బ్యారేజీలు, ఇతర ప్రాజెక్టులపై కూడా తెలంగాణ ప్రభుత్వం గట్టిగా అభ్యంతరం వ్యక్తం చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నీటి వాటాను కాపాడేందుకు అన్ని స్థాయిల్లో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు.

# ఎంఎస్ఎంఈలతోనే ఆర్థికాభివృద్ధి

**హైదరాబాద్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆర్థిక అసమానతలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో అఖిల భారత ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ తెలంగాణ ఎంఎస్ఎంఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ఆర్థిక విధానంలో కీలక భాగమని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉపాధిలో 60 శాతానికి పైగా, స్థూల ఆర్థిక ఉత్పత్తిలో గణనీయమైన వాటాను ఎంఎస్ఎంఈలు కలిగి ఉన్నాయని వివరించారు. తెలంగాణలో మూడు నుంచి ఐదుగురు ఉద్యోగులతో నడిచే చిన్న పరిశ్రమలే ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారమని, మరిన్ని పరిశ్రమలు ఏర్పడితే యువతకు ఉపాధి విస్తరిస్తుందని అన్నారు. సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా చిన్న పారిశ్రామికవేత్తలకు అవకాశాలు కల్పించడం అవసరమని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ద్వారా ప్రజల ఆశలు, సమస్యలను కాంగ్రెస్ పార్టీ దగ్గరగా తెలుసుకుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక వర్గాల సర్వే ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు లక్షిత సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో ప్రాధాన్యం ఇస్తోందని ఆయన చెప్పారు. ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వంటి మహిళా నాయకత్వాన్ని దేశానికి అందించామని గుర్తుచేశారు. మహిళలు విమానయానం, ఇంజినీరింగ్, పరిపాలన వంటి అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతున్నారని, మహిళల భాగస్వామ్యం పెరిగితే దేశ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. తెలంగాణలో ఎంఎస్ఎంఈ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ, ఉచిత విద్యుత్, నాణ్యమైన బియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావించారు. యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనిసెఫ్ తెలంగాణ చీఫ్ డాక్టర్ జీలాల్మన్ టఫెస్సే, టర్కియే కాన్సులేట్ కమర్షియల్ అటాషే టుగ్సే గుల్, ఎఫ్‌టీసీసీఐ సీనియర్ డైరెక్టర్ టి. సుజాత, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఎంఎస్ఎంఈల తెలంగాణ చైర్మన్ పి. శ్రీనివాస్, ఏఐపీసీ నాయకులు ఇర్ఫాన్ అజీజ్, శశాంక్ పసుపులేటి తదితరులు పాల్గొని యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధి, ఆవిష్కరణలు, సుస్థిర అభివృద్ధి అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# హస్మత్‌పేటలో హైడ్రా భారీ ఆపరేషన్

- **రూ.750 కోట్ల విలువైన స్థలానికి ఫెన్సింగ్**
- **ఆక్రమణలకు హైడ్రా గట్టి చెక్**

**హైదరాబాద్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం హస్మత్‌పేటలో హైడ్రా శనివారం భారీ స్థాయిలో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి రక్షించింది. సర్వే నంబర్–1లో ఉన్న ఈ భూమి మార్కెట్ విలువ సుమారు రూ.750 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రెవెన్యూ శాఖ నుంచి అందిన సమాచారంతో హైడ్రా అధికారులు భారీ పోలీసు బందోబస్తుతో రంగంలోకి దిగి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. హస్మత్‌పేట సర్వే నంబర్–1లో మొత్తం 108 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, కాలక్రమేణా సుమారు 98 ఎకరాలు వివిధ రూపాల్లో ఆక్రమణలకు గురైనట్లు అధికారులు వెల్లడించారు. వంద గజాల చొప్పున ప్లాట్లుగా విభజించి విక్రయించడం, కొంతమంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం, తాత్కాలిక నిర్మాణాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రభుత్వ భూమి దాదాపు పూర్తిగా ఆక్రమణకు గురైందని గుర్తించారు. ప్రస్తుతం మిగిలి ఉన్న 10 ఎకరాలను కాపాడేందుకు హైడ్రా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆపరేషన్ సందర్భంగా ఇప్పటికే నివాసాలు కొనసాగుతున్న ఇళ్లను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో మాత్రమే ఆక్రమణలను తొలగిస్తూ చర్యలు చేపట్టారు. భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు జరగకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

# సౌదీ ప్రయాణికులకు కొత్త నిబంధనలు

**డెస్క్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

సౌదీ అరేబియాకు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే ప్రయాణికుల కోసం ఆ దేశ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను అమలు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చర్యల్లో భాగంగా నగదు, బంగారం, ఆభరణాలు, విలువైన లోహాలు, రత్నాల రవాణాపై నిబంధనలను మరింత కఠినతరం చేసింది. గతంలో అమల్లో ఉన్న 60 వేల సౌదీ రియాల్స్ డిక్లరేషన్ పరిమితిని 40 వేల సౌదీ రియాల్స్‌కు తగ్గించింది. కొత్త నిబంధనల ప్రకారం 40 వేల సౌదీ రియాల్స్ లేదా అంతకంటే ఎక్కువ విలువైన నగదు, బంగారం, విలువైన లోహాలు, రత్నాలు లేదా ఆభరణాలను వెంట తీసుకెళ్లే ప్రతి ప్రయాణికుడు కస్టమ్స్ అధికారులకు తప్పనిసరిగా రాతపూర్వక డిక్లరేషన్ సమర్పించాలి. ఆయా వస్తువులకు సంబంధించిన కొనుగోలు బిల్లులు లేదా ఇన్‌వాయిస్‌లను కూడా సమర్పించాల్సి ఉంటుంది. నిబంధనలను పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సౌదీ అధికారులు స్పష్టం చేశారు. అవసరమైన వివరాలు వెల్లడించకపోతే సంబంధిత వస్తువులను 72 గంటల పాటు తాత్కాలికంగా స్వాధీనం చేసుకుంటారు. అనంతరం విచారణ ఆధారంగా తదుపరి చర్యలు చేపడతారు. మొదటిసారి నిబంధనలు ఉల్లంఘించిన వారిలో మనీ లాండరింగ్ ఉద్దేశం లేదని తేలితే స్వాధీనం చేసుకున్న వస్తువుల విలువలో 10 నుంచి 25 శాతం వరకు జరిమానా విధిస్తారు. అదే తప్పిదం మళ్లీ చేస్తే జరిమానాను 50 శాతం వరకు పెంచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఒకవేళ నేరపూరిత ఉద్దేశం ఉన్నట్లు అనుమానిస్తే కేసును నేరుగా పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ చేస్తారు.

# దివ్యాంగులకు మరింత అండ

**హైదరాబాద్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

దివ్యాంగులను జాలి చూపాల్సిన వారిగా కాకుండా సమాజ అభివృద్ధిలో సమాన భాగస్వాములుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఈ–ఆటోలను పంపిణీ చేస్తూ ఆమె మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని పేర్కొన్నారు. హెలెన్ కెల్లర్ జీవితం ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని మంత్రి అన్నారు. చిన్న వయసులోనే చూపు, వినికిడి కోల్పోయినా ఆమె సంకల్పబలంతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు. దివ్యాంగులను జాలితో కాకుండా గౌరవంతో చూడాలని, వారికి సమాన అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దివ్యాంగులకు విద్య, ఉపాధి, పునరావాసం, జీవనోపాధి రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.సెర్ప్ ఆధ్వర్యంలో దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 13 వేలకుపైగా దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలు ఏర్పాటై, 82 వేల మందికి పైగా సభ్యులు అందులో భాగస్వాములయ్యారని తెలిపారు. స్త్రీనిధి ద్వారా రూ.38.16 కోట్ల రుణాలు, మహిళా సంఘాల ద్వారా రూ.4.13 కోట్ల రుణాలు, రూ.11.62 కోట్ల పొదుపులు సమకూరగా, 2,248 మందికి జీవనోపాధి అవకాశాలు కల్పించామని వెల్లడించారు. ప్రస్తుతం 26 జిల్లాల్లో 74 నైబర్‌హుడ్ సెంటర్ల ద్వారా దాదాపు మూడు వేల మంది దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ప్రత్యేక విద్య, కౌన్సెలింగ్, నైపుణ్యాభివృద్ధి వంటి సేవలు అందుతున్నాయని మంత్రి తెలిపారు.

# ఆర్టీసీ హామీలన్నీ అమలు చేస్తాం

**హైదరాబాద్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు, ఉన్నతాధికారులు, ఆర్టీసీ యాజమాన్యం, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో దాదాపు 14 గంటలపాటు విస్తృతంగా చర్చలు జరిపి ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని గుర్తు చేశారు. సమావేశంలో మొత్తం 32 డిమాండ్లను పరిశీలించగా, వాటిలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించినట్లు తెలిపారు. యాజమాన్యం పరిధిలోని అంశాల పరిష్కారానికి ఇప్పటికే చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు.ప్రభుత్వ పరిధిలో ఉన్న ముఖ్య అంశాలైన గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు, 2021 వేతన సవరణ, ఆర్టీసీ విలీన ప్రక్రియపై ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. 2021 పీఆర్సీ కింద ప్రకటించిన 11 శాతం వేతన పెంపు జూలై నెల జీతాల నుంచే అమల్లోకి వస్తుందని వెల్లడించారు.

# సామాజికంగా ప్రభావవంతమైన పరిశోధనలపై దృష్టి పెట్టాలి

- డైరెక్టర్ & చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. సాత్విక రెడ్డి.

**ఉమ్మడి రంగారెడ్డి/ మోయినాబాద్, జూన్ 27, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**

రంగారెడ్డి జిల్లా మోయినాబాద్ మండలంలోని చైతన్య డీమ్డ్ టూ బి యూనివర్సిటీ, హిమాయత్‌నగర్ ప్రాంగణంలో నిర్వహించిన ఘనమైన కార్యక్రమంలో ఫార్మసీ విభాగానికి చెందిన ఆస్ఫియా కౌసర్ కు డాక్టర్ అఫ్ ఫిలాసఫీ (పి హెచ్ డి) డిగ్రీని విశ్వవిద్యాలయం ప్రదానం చేసింది. ఆస్ఫియా కౌసర్ " డెవలప్మెంట్ అండ్ ఎవాల్యుయేషన్ అఫ్ మల్టీఫంక్షనల్ సైక్లోడెక్ట్రిన్ నానోస్పాంజెస్ ఫర్ ది ఎఫెక్టివ్ డెలివరీ అఫ్ ఏంటిక్యాన్సర్ డ్రగ్స్" అనే పరిశోధనా అంశంపై చేసిన థీసిస్ ద్వారా ఈ గౌరవాన్ని ఆమె అందుకున్నారు. ఈ పరిశోధన ఆమె డాక్టర్. సరిత చుక్క పర్యవేక్షణలో పనిచేశారు. ఈ డిగ్రీని చైతన్య విశ్వవి ద్యాలయ డైరెక్టర్ & చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. సాత్విక రెడ్డి అధికారికంగా ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ఫార్మసీ రంగంలో పరిశోధన దేశ అభివృద్ధికి అత్యంత కీలకం. ఇది విశ్వవిద్యాలయానికి గర్వకారణం, క్యాన్సర్ నిరోధక ఔషధాల సమర్థవంతమైన సరఫరా కోసం బహుళ–ప్రయోజన సైక్లోడెక్స్ట్రిన్ నానోస్పాంజ్‌ల అభివృద్ధి పై అధ్యయనం చేయడం చాల శుభపరిణామం" అని పేర్కొన్నారు. అలాగే ఆమె చైతన్య విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగం సమాజానికి అవసరమైన, సృజనాత్మకమైన పరిశోధనలను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవి ద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి. శంకర్ లింగం, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. రవీందర్, డీన్ (రిసెర్చ్ & డెవలప్మెంట్) ఆచార్య క్రిస్టఫర్, డీన్ (అడ్మినిస్ట్రేషన్) ఆచార్య ఎ. రాజు, డీన్ (ఫార్మసీ), ఆచార్య జి. కుమారస్వామి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య బి. రాజేందర్ రెడ్డి, డిప్యూటీ కంట్రోలర్ ఆచార్య ఈ. జగదీశ్ కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ & పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం

- ఆశిష్ సాంగ్వాన్
- దోమకొండ సంక్షేమ పాఠశాల తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి, కలెక్టర్..
- ఆర్‌జీయూకేటీ విద్యార్థినికి రూ.10 వేల ఆర్థిక సహాయం..

**కామారెడ్డి, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

జిల్లాలో విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా జిల్లా ప్రత్యేక అధికారి బి. విజయేంద్ర, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం దోమకొండ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన అధికారులు విద్య, వసతి, ఆహారం తదితర సౌకర్యాలను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, వర్షాకాలంలో ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా దోమతెర వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూనిఫాం వస్త్రాలు అందిన వెంటనే కొలతలు తీసి కుట్టించి పంపిణీ చేయాలని సూచించారు. బాల్య వివాహాలపై అప్రమత్తంగా ఉండాలని, అలాంటి ఘటనలు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థినులకు సూచించారు. పోషకాహారం తీసుకోవడం, ఆహారాన్ని వృథా చేయకుండా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించగా, ఉపాధ్యాయులు, వార్డెన్లు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.అనంతరం కలెక్టరేట్‌లో ఆర్‌జీయూకేటీ బాసర్‌లో విద్యనభ్యసిస్తున్న కామారెడ్డి జిల్లా విద్యార్థిని నిఖితకు రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా రూ.10 వేల ఆర్థిక సహాయ చెక్కును కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు ఏ విద్యార్థి చదువుకు అడ్డంకిగా మారకూడదని, అవసరమైన వారికి జిల్లా పరిపాలన అండగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో ఉన్నత విద్యను కొనసాగించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# ₹9 వేల అదనపు చెల్లింపు.. 25 రోజులైనా రీఫండ్ చేయని ఆర్గానిక్ క్రీమరీ!

- వైద్య అత్యవసర పరిస్థితి వివరించినా స్పందించని యాజమాన్యం..
- వినియోగదారుడు బూర్ల వివేక్ ఆవేదన..

**హైదరాబాద్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

హైదరాబాద్‌లోని చందానగర్‌లో ఉన్న ఆర్గానిక్ క్రీమరీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిపై వినియోగదారుడు బూర్ల వివేక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ 8న రూ.1,001 విలువైన ఐస్‌క్రీమ్ కొనుగోలు సమయంలో యూపీఐ ద్వారా పొరపాటున రూ.10,001 చెల్లించడంతో అదనంగా వెళ్లిన రూ.9 వేల విషయాన్ని అదే రోజు స్టోర్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. లావాదేవీ పూర్తిగా ధృవీకరించబడినప్పటికీ, వారం రోజుల్లో రీఫండ్ చేస్తామని చెప్పిన యాజమాన్యం 25 రోజులు గడిచినా ఒక్క రూపాయి కూడా తిరిగి చెల్లించలేదని ఆరోపించారు.ఈ వ్యవధిలో తమ సోదరికి అత్యవసర శస్త్రచికిత్స అవసరమై, తమ సొంత డబ్బును తిరిగి ఇవ్వాలని పలుమార్లు వేడుకున్నప్పటికీ యాజమాన్యం కనీస మానవత్వం చూపలేదని బూర్ల వివేక్ వాపోయారు. అంతేకాకుండా అకౌంట్స్ మేనేజర్ సైతం అమర్యాదకరంగా ప్రవర్తించి, సమస్య పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు.చెల్లింపు రసీదులు, యూపీఐ లావాదేవీ వివరాలు, బిల్లు ఆధారాలతో సోషల్ మీడియాలో విషయాన్ని వెల్లడించిన బూర్ల వివేక్, వినియోగదారుల డబ్బును ఇంతకాలం నిలిపివేయడం వ్యాపార నైతికతకు విరుద్ధమని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థలు వెంటనే జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయడంతో పాటు బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.




# దుండిగల్ సర్కిల్‌లో వేగంగా సార్ -2026 ఎన్యూమరేషన్

- ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్
- జూలై 24 వరకు కొనసాగనున్న ఇంటింటి సర్వే

**కుత్బుల్లాపూర్, జూన్ 27: (నవజ్యోతి ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల మేరకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( సార్ – 2026) కార్యక్రమం దుండిగల్ సర్కిల్ పరిధిలో పకడ్బందీగా కొనసాగుతోంది. ఓటరు జాబితా సవరణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక ఎన్యూమరేషన్ ప్రక్రియను దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు ( బిఎల్‌ఓలు) ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. ప్రజలు తమ ఓటరు వివరాలను సరిచూసుకుని చిరునామా, పేరు లేదా ఇతర మార్పులు ఉంటే సంబంధిత ఫారమ్‌లలో నమోదు చేయాలని సూచించారు. ప్రతి అర్హ పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రత్యేక రివిజన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.జూన్ 25 నుంచి ప్రారంభమైన ఇంటింటి సర్వే మరియు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం జూలై 24 వరకు కొనసాగనుంది. ఈ గడువులోగా ప్రతి ఇంటిని సందర్శించి పూర్తి వివరాలు సేకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అధికారులు అందించే ఫారాలను పూర్తి చేసి తదుపరి సందర్శన సమయంలో తిరిగి అందజేయాలని ఓటర్లను కోరారు. ఒక కాపీ అధికారిక నమోదు కోసం కాగా, మరో కాపీని అక్నాలెడ్జ్‌మెంట్‌గా తమ వద్ద భద్రపరుచుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత బూత్ లెవల్ అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు.



# మల్లంపేట-బాచుపల్లి రహదారిపై భారీ ఎన్‌క్రోచ్‌మెంట్ డ్రైవ్

- రోడ్ల ఆక్రమణలకు చెక్..24 అక్రమ స్టాల్స్ తొలగింపు
- ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే సహించం:అధికారులు

**కుత్బుల్లాపూర్, జూన్ 27: (నవజ్యోతిప్రతినిధి)**

రహదారులపై పెరుగుతున్న ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో దుండిగల్ సర్కిల్ అధికారులు ప్రత్యేక ఎన్‌క్రోచ్‌మెంట్ డ్రైవ్ చేపట్టారు. మల్లంపేట ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబర్–4ఏ నుంచి బాచుపల్లి వరకు ఉన్న ప్రధాన రహదారి వెంట అక్రమంగా ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్, తాత్కాలిక నిర్మాణాలు మరియు ఇతర ఆక్రమణలను గుర్తించి తొలగింపు చర్యలు ప్రారంభించారు.అధికారుల సమాచారం ప్రకారం, మల్లంపేట–బాచుపల్లి మార్గంలో సుమారు 1.5 కిలోమీటర్ల మేర రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన 32 అక్రమ నిర్మాణాలను గుర్తించారు. వీటిలో ఇప్పటివరకు 24 ఫుడ్ స్టాల్స్ మరియు ఇతర ఆక్రమణలను తొలగించినట్లు తెలిపారు. మిగిలిన ఆక్రమణలను కూడా త్వరలోనే పూర్తిస్థాయిలో తొలగిస్తామని వెల్లడించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రజా రహదారులపై అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. రహదారుల ఆక్రమణల వల్ల ట్రాఫిక్ రద్దీ పెరగడంతో పాటు పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఆక్రమణలపై నిరంతర ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రహదారులను ఆక్రమించిన నిర్మాణాలను జేసీబీల సహాయంతో తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్, జీడిమెట్ల ట్రాఫిక్ సిఐ నరసింహారావు, ఏసిపి శ్రీనివాస్, టీపీఎస్ ముఖేష్ సింగ్, టౌన్ ప్లానింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సిబ్బంది, జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



## గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా లింగాల రాజబాబు గౌడ్

**కామారెడ్డి, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**



గౌడ ఉద్యోగులు, వివిధ వృత్తి నిపుణుల సంఘం కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా లింగాల రాజబాబు గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంఘం జిల్లా సర్వసభ్య సమావేశంలో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా రాజబాబు గౌడ్ మాట్లాడుతూ, సంఘం వేదికగా గౌడ సమాజ అభ్యున్నతి, నిరుపేద గౌడ విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో ఐదు వేల సభ్యత్వాల నమోదు లక్ష్యంగా పనిచేస్తూ, గౌడ ఉద్యోగులు, అధికారులు, వివిధ రంగాల వృత్తి నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు.తనపై విశ్వాసం ఉంచి జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీ, జిల్లా నాయకత్వం, సభ్యులందరికీ లింగాల రాజబాబు గౌడ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## 30వ వార్డులో చైర్‌పర్సన్ ఉమారాణి క్షేత్రస్థాయి పర్యటన

**కామారెడ్డి, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**



జిల్లా కేంద్రంలోని 30వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రహదారులు, తాగునీటి సరఫరా తదితర పౌర సమస్యలను పరిశీలించారు.స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న చైర్‌పర్సన్, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి వార్డులో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఫాతిమా మజీద్, తాటి లావణ్య ప్రసాద్, మున్సిపల్ ఉప ఇంజనీర్ హన్మంతరావు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## 38వ వార్డులో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ఉమారాణి

**కామారెడ్డి, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 38వ వార్డులో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక సవరణ కార్యక్రమం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, పేర్లు, చిరునామా, ఇతర వివరాల్లో మార్పులు ఉంటే సకాలంలో సరిచేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించి తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన వివరాలను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి పర్యవేక్షకుడు బాలరాజు, బూత్ స్థాయి అధికారులు భార్గవి, మనోజ్ కుమార్, భారతి, వార్డు అధికారి స్నేహలత, అవినాష్, గ్రామ పంచాయతీ అధికారి ప్రవీణ్, సీనియర్ నాయకులు చాట్ల రాజేశ్వర్, అమీర్, దాసు, వేణు, నాగరాజు, అఖిల్, శ్రీకాంత్, నాగార్జున్ గౌడ్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## బస్వాపూర్ లో సి.ఎం.ఆర్ .ఎఫ్ చెక్కు పంపిణీ

**బిక్కనూరు, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**



బిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన ఇరుపాక సంధ్యకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి (సి.ఎం.ఆర్.ఎఫ్) నుంచి మంజూరైన రూ.40 వేల చెక్కును శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ తుడుం పద్మస్వామి, గ్రామ అధ్యక్షుడు చింతనూరి సిద్ధరాములు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తుడుం జీవన్, ఉప సర్పంచ్ కార్తీక్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి మౌనిక రెడ్డి, సీనియర్ నాయకులు బాగారెడ్డి, లోకేష్, ఎల్లం, నవీన్, భూషణం, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ లబ్ధిదారులకు గోడ గడియారాల పంపిణీ

**మద్నూర్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**



మద్నూర్ మండల కేంద్రంలో ఇందిరమ్మ పథకం లబ్ధిదారులకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు శనివారం గోడ గడియారాలను పంపిణీ చేశారు.అభివృద్ధి, నిరుపేదల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్ సమస్యల పరిష్కారానికి మంత్రి పొన్నంను కోరిన నాయకులు

**హైదరాబాద్/ కామారెడ్డి జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**



కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బస్టాండ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన వారిలో జిల్లా కాంగ్రెస్ కమిటీ న్యాయ విభాగం అధ్యక్షుడు దేవరాజ్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీరామ్ ఆనంద్, మాజీ జడ్పీటీసీ నంద రమేష్, అల్లాడి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## కాటా శ్రీనివాస్ అన్నా సేవాస్ఫూర్తితో వీరభద్ర స్వామి దేవాలయానికి రూ.1 లక్ష విరాళం

### బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సుకూరి జగదీశ్వర్ ప్రకటన

**ఉమ్మడి మెదక్(నవ జ్యోతి ప్రతినిధి)జూన్ 27 /**



మరవెల్లి గ్రామంలోని శ్రీ వీరభద్ర స్వామి దేవాలయ నిర్మాణానికి బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సుకూరి జగదీశ్వర్ రూ.1,00,000 (ఒక లక్ష రూపాయలు) విరాళం ప్రకటించారు. సమాజ సేవలో నిరంతరం ముందుండే కాటా శ్రీను సేవాస్ఫూర్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ, సమాజ సేవ, గ్రామాభివృద్ధి, దేవాలయాల అభివృద్ధికి కాటా శ్రీనివాస్ అన్నా చేస్తున్న సేవా కార్యక్రమాలు తనకు ఎంతో ప్రేరణగా నిలిచాయని పేర్కొన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని శ్రీ వీరభద్ర స్వామి దేవాలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా రూ.1 లక్ష విరాళం అందిస్తున్నట్లు వెల్లడించారు.అలాగే గ్రామ ప్రజలు, దాతలు తమకు చేతనైన సహాయ సహకారాలు అందించి దేవాలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అందరి సహకారంతో దేవాలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తై, శ్రీ వీరభద్ర స్వామి ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.గ్రామాభివృద్ధి, ఆధ్యాత్మిక సేవల పట్ల యువత ముందుకు రావడం అభినందనీయమని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## శభాష్ పల్లి గ్రామంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమానికి శ్రీకారం

**శివంపేట జూన్ 27 నవ జ్యోతి ప్రతినిధి ఆకుల శ్రీనివాస్**



శివంపేట మండలం శభాష్ పల్లి గ్రామంలోఇంటింటా ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం గ్రామంలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (SIR) కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ అయ్యగారి యాదగిరి, ఆధ్వర్యంలో ప్రారంభించారు ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ లో భాగంగా ఇంటింటికి వెళ్లి ఎనిమరేషన్ ఫారాలు పంపిణీ చేసి వివరాల నమోదు ప్రక్రియను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎ అయ్యగారి ప్రశాంత్ , పాల్గొని ఓటరు జాబితాను డిస్ట్రిబ్యూట్ చేసి కచ్చితంగా రూపొందించేందుకు తమ సహకారాన్ని అందించాలని అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ఓటరు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజాప్రతినిధులకు సూచించారు

## పేటలో వేగవంతమైన ఎస్ఐఆర్ 176 పోలింగ్ లో ఓటరు ఫారాల పంపిణీ.

**సదాశివపేట. జూన్ 27. (నవజ్యోతిప్రతినిధి)**



సదాశివపేట పట్టణంలో 19వ వార్డులో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం శనివారం వేగవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా 19వ వార్డుకు చెందిన 176 పోలింగ్ స్టేషన్‌తో సంబంధించిన పరిధిలో అర్హులైన ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అధికారులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివాజీ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు గౌడ్, 17వ వార్డు కౌన్సిలర్ షాజీ, బీఎల్‌వో సూపర్వైజర్ శివాని, బీఎల్‌వో లక్ష్మణ్, బీఎల్ఎండి సలీం పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఫారాలను అందజేస్తూ వాటిని పూర్తిగా నింపి నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేర్లు, చిరునామా, ఇతర వివరాలను సరిచేసుకునేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియ మంచి అవకాశమని తెలిపారు. ప్రతి అర్హ ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేయించుకోవాలని కోరారు.ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రజలు చురుకుగా పాల్గొని ఎన్నికల సంఘానికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఈనెల 30న రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల బంద్‌కు పిలుపు

### బీసీ సేన విద్యార్థి సంఘం హెచ్చరిక

**మేడ్చల్ జూన్ 27(నవజ్యోతి ప్రతినిధి)**



ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 30న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు బీసీ సేన విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది.ఈ మేరకు ఆ సంఘం కేంద్ర కమిటీ సభ్యులు గోదా అరుణ్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న రూ. 8 వేల కోట్ల ఫీజు బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.నిరసన కార్యక్రమాలు ఈనెల 30న రాష్ట్రంలోని అన్ని కాలేజీలను బంద్ చేయిస్తామని అరుణ్ యాదవ్ ప్రకటించారు. అదే రోజున రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కలెక్టరేట్లు, ఆర్డీఓ మరియు ఎంఆర్ఓ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

# జడ్పీహెచ్ఎస్‌లో ల్యాప్‌టాప్‌లు, భోజన ప్లేట్లు, నోట్‌బుక్స్

- ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ సంస్థలు దత్తత తీసుకోవాలి
- ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి...

**ఉమ్మడి మెదక్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**



ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు తమ సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి భాగస్వాములు కావాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నారాయణఖేడ్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో 'అనేంట్ డిజిటల్' సంస్థ సౌజన్యంతో 10 ల్యాప్‌టాప్‌లు, 'లయన్స్ క్లబ్ హైదరాబాద్ సౌత్' ఆధ్వర్యంలో 200 భోజన ప్లేట్లు, నోట్‌బుక్స్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల కార్పొరేట్ సంస్థలు నారాయణఖేడ్ వంటి వెనుకబడిన ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని విద్యార్థులకు సాంకేతిక, విద్యా వనరులు అందించాలని కోరారు. డిజిటల్ యుగంలో ల్యాప్‌టాప్‌లు వంటి సాంకేతిక పరికరాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సామాజిక సేవలో భాగంగా విద్యార్థులకు అవసరమైన వస్తువులు అందిస్తున్న అనేంట్ డిజిటల్, లయన్స్ క్లబ్ హైదరాబాద్ సౌత్ సేవలను ఆయన అభినందించారు.నారాయణఖేడ్ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల సంఖ్య పూర్తిస్థాయికి చేరుకోవడంతో "నో అడ్మిషన్" బోర్డు ఏర్పాటు చేయడం ప్రభుత్వ పాఠశాల ప్రతిష్ఠకు, ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని ఎమ్మెల్యే కొనియాడారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశా లల్లో నాణ్యమైన విద్య అందు తోందని, నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఇదే తరహాలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, నాయకులు పండరి రెడ్డి, లయన్స్ క్లబ్ హైదరాబాద్ సౌత్ అధ్యక్షుడు అర్జిత్ సింగ్ ముగ్రాల్, శివచరణ్, పవన్, హెచ్ఎం మన్మథ కిషోర్, ఎంఈఓ విశ్వనాథ్, చంద్రశేఖర్ ఆచార్య, మల్లేశం, జైపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పండరి రెడ్డి, అమీద్, యూసుఫ్, ముధసిర్, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, అనేంట్ డిజిటల్ సంస్థ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా రొయ్యల చెరువుల తవ్వకాలు..?

- గేదెల్లంకలో అక్రమ తవ్వకాలపై గ్రామస్తుల ఆందోళన.. అధికారుల జోక్యం కోరుతూ విజ్ఞప్తి

**ముమ్మిడివరం, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి- రెడ్డి వీరబాబు):**

ముమ్మిడివరం మండలం గేదెల్లంక గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 150, 151లో ఎలాంటి అనుమతులు లేకుండానే రొయ్యల చెరువుల తవ్వకాలు చేపడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ తవ్వకాలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.గ్రామస్తుల కథనం ప్రకారం, గతంలో ఇదే భూమిలో చెరువుల తవ్వకాలకు ప్రయత్నించగా రైతులు, స్థానికులు అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి. అయితే ఇటీవల మళ్లీ భారీ యంత్రాలతో తవ్వకాలు ప్రారంభించి, చెరువుల కోసం బండ్లు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.తవ్వకాలపై ప్రశ్నించిన వారిని కొందరు బెదిరింపులకు గురిచేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాల వల్ల వ్యవసాయ భూములు దెబ్బతినడంతో పాటు పరిసర ప్రాంతాల్లో పర్యావరణ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.గేదెల్లంకలో జరుగుతున్న తవ్వకాలపై రెవెన్యూ, మత్స్యశాఖతో పాటు సంబంధిత అధికారులు



క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, అనుమతులు లేకుండా పనులు జరుగుతున్నట్లు తేలితే వెంటనే నిలిపివేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జూలై 1 నుంచి చెత్తను నాలుగు విభాగాలుగా వేరు చేయాలి

- సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్–2026 అమలుకు కార్యాచరణ..
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్.

**ఉమ్మడి మెదక్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**



జూలై 1 నుంచి జిల్లాలో చెత్తను తప్పనిసరిగా నాలుగు విభాగాలుగా వేరు చేసి అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘన వ్యర్థాల నిర్వహణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్–2026 అమలుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.ఇళ్లలోని వ్యర్థాలను తడి చెత్తను గ్రీన్ డబ్బాలో, పొడి చెత్తను బ్లూ డబ్బాలో, సానిటరీ వ్యర్థాలను రెడ్ డబ్బాలో, హానికర వ్యర్థాలను బ్లాక్ డబ్బాలో వేర్వేరుగా సేకరించి ఇవ్వాలని సూచించారు. చెత్తను వేరు చేయకుండా ఇవ్వొద్దని స్పష్టం చేశారు.హోటళ్లు, హాస్టళ్లు, పరిశ్రమలు, రెస్టారెంట్లు, ధాబాలు, ఆస్పత్రులు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు తమ వ్యర్థాలను సొంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు ముందస్తుగా ఆయా సంస్థలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా నాలుగు రంగుల చెత్త డబ్బాలను ఏర్పాటు చేయాలని సూచించారు.జిల్లాలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్–2026 నిబంధనలను సమర్థవంతంగా అమలు చేసి పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు.సమావేశంలో అదనపు కలెక్టర్ నాగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, డీఆర్డీఓ శ్రీనివాసరావు, ఎంపీడీవోలు, ఏపీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇంటింటా తడి చెత్త పొడి చెత్త అవగాహన

**శివంపేట జూన్ 27 నవజ్యోతి ప్రతినిధి ఆకుల శ్రీనివాస్**

శివంపేట మండలంలోని శభాష్ పల్లి గ్రామపంచాయతీలో అయ్యగారి యాదగిరి, నాలుగు రకాల చెత్త నిర్వహణ నియమాలు 2026 ప్రకారం ఇంటింటా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రతి ఇంటి నుండి గ్రామపంచాయతీ ట్రాక్టర్కు ఇచ్చే చెత్తను నాలుగు రకాలుగా విభజించి అనగా గ్రీన్ బుట్టలో తడి చెత్త కూరగాయలు వ్యర్థాలు, ఆహార వ్యర్థాలు తినే వస్తువులు ఏవైనా మెలిగిపోయినవి భూమిలో కరిగిపోయేటివి కుళ్లిపోయేటివి మొదలగునవి, నీలిరంగు పొడి వేద్దాలు ప్లాస్టిక్ వస్తువులు ప్లాస్టిక్ కవర్లు ప్లాస్టిక్ బాటిల్స్ అట్టముక్కలు పుస్తకాలు బట్ట ముక్కలు, గాదు సీసాలు ఇనుప వస్తువులు మొదలగునవి, ఎరుపు రంగు సానిటరీ నాప్కిన్స్ మెడికల్ వాడిన వస్తువులు పేపర్ తో చుట్టి ఇచ్చేట్టు మొదలగునవి, నలుపు రంగు ప్రత్యేక హానికర బల్బులు బ్యాటరీలు మందులు ఈ వేస్ట్ పెయింట్లు ఇతర హానికర పదార్థాలు పై విధంగా నాలుగు రకాల గా వేరుచేసి చెత్తను గ్రామపంచాయతీ ట్రాక్టర్ సిబ్బందికి ఇచ్చినచో వారు సెగ్రిగేషన్ షెడ్ వద్దకు తరలించి వాటిని వేరువేరుగా నిర్వహించుటకు వీలుపడునని అన్నారు మరియు పారిశుద్ధ్యం మెరుగుపడుతుందని అందరు కూడా పై పద్ధతులు అనుసరిస్తూ గ్రామపంచాయతీకి సహకరిస్తే గ్రామ ప్రజలు ఆరోగ్యవంతంగా మరియు గ్రామం కూడా పరిశుభ్రంగా ఉండుటకు వీలుపడనని ఇట్టి అవగాహన సదస్సులో వివరించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో



గ్రామ సర్పంచ్ అయ్యగారి యాదగిరి, ఉప సర్పంచ్ అయ్యగారి ప్రశాంత్, గ్రామపంచాయతీ కార్యదర్శి గీత, అంగన్వాడి టీచర్ అనురాధ, గ్రామ ఆశ సిస్టర్ వరమ్మ, మరియు వార్డ్ నెంబర్లు, జోడు లక్ష్మి , జోడు సత్యనారాయణ పారిశుద్ధ్య కార్మికులు గ్రామస్తులు పాల్గొన్నారు

# మేడ్చల్‌లో జోరుగా సార్ అవగాహన కార్యక్రమం

- పౌరసత్వ నమోదుపై బీజేపీ నేతల ప్రత్యేక దృష్టి

**మేడ్చల్, జూన్ 27(నవజ్యోతి ప్రతినిధి)**

మేడ్చల్ ఉమ్మడి డివిజన్ల పరిధిలో బీజేపీ సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో 'సార్' (స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్) కార్యక్రమం అత్యంత విజయవంతంగా కొనసాగుతోంది. ఓటరు నమోదు మరియు పౌరసత్వ ధృవీకరణ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బీజేపీ నాయకులు ప్రత్యేక చొరవ చూపుతున్నారు.ఇంటింటికీ బీజేపీ బృందాలు ఈ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్, కిష్టాపూర్–పూడూర్ డివిజన్లలోని పలు బూత్‌లలో బీజేపీ బి ఎల్ ఎ లు మరియు బి ఎల్ ఓ లు సంయుక్తంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. ఓటర్లకు సార్ పత్రాలను అందజేస్తూ, వాటిని ఎలా పూర్తి చేయాలో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.శ్రీనివాస్ గౌడ్ కీలక సూచనలు ఈ సందర్భంగా చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సార్ ద్వారా నమోదు చేసుకోవాలి. దీని ద్వారా భారత దేశ పౌరసత్వాన్ని మరింత పటిష్టం చేసుకోవచ్చు" అని పేర్కొన్నారు. బి ఎల్ ఓ లు అందజేసే రెండు రకాల పత్రాల గురించి వివరిస్తూఒక పత్రాన్ని రసీదుగా తమ వద్దే భద్రపరుచుకోవాలి.రెండవ పత్రాన్ని బి ఎల్ ఓ ల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలి.ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పత్రాలను నింపాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.పాల్గొన్న నాయకులు ఈ కార్యక్రమంలో చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్‌తో పాటు బీజేపీ నాయకులు మల్లేష్ యాదవ్, రతన్ రాథోడ్, వెంకటేష్ ముదిరాజ్,



నర్సింగ్ రజక, పురుషోత్తం, వడ్డేపల్లి నర్సింహా కురుమ, ఒగ్గు భాస్కర్ కురుమ తదితరులు పాల్గొన్నారు. తమ బూత్‌ల పరిధిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు బీజేపీ శ్రేణులు కృషి చేస్తున్నాయి.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- గుడిసెల్లో నివసించే వారిని గుర్తించి నివేదిక ఇవ్వాలి..
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టర్ ప్రతిమా సింగ్...



**ఉమ్మడి మెదక్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో గృహ నిర్మాణ శాఖ అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాకు మంజూరైన 8,953 ఇందిరమ్మ ఇళ్లలో 7,271 ఇళ్లకు (81 శాతం) గ్రౌండింగ్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, ప్రతి వారం దశలవారీగా పూర్తి చేసేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. ఇసుక, గ్రావెల్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇంకా ప్రారంభం కాని ఇళ్లను వెంటనే ప్రారంభించి జూలై 15లోపు పురోగతిలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతిరోజూ పూర్తవుతున్న ఇళ్లపై సమగ్ర నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు.ఇళ్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాలు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులైతే డీఆర్‌డీఏ ద్వారా రుణాలు అందించి ఇళ్ల నిర్మాణానికి సహకరించాలని అధికారులను ఆదేశించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో ప్రస్తుతం గుడిసెల్లో నివసిస్తున్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక అధికారులు ఆయా మండలాల్లో గుడిసెల్లో నివసించే కుటుంబాలను త్వరితగతిన గుర్తించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ మాణిక్యం, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డీపీఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు, డీఈలు, ఏఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణలో ప్రైవేట్ సెక్యూరిటీ కీలకం

- కుత్బుల్లాపూర్ జోన్‌లో సెక్యూరిటీ సిబ్బందికి పోలీసుల అవగాహన సదస్సు
- కండ్లకోయ సీఎంఆర్ క్యాంపస్‌లో 300 మందితో భద్రతా అవగాహన కార్యక్రమం

**కుత్బుల్లాపూర్, జూన్ 27: (నవజ్యోతి ప్రతినిధి)**

నగర పరిధిలో పెరుగుతున్న భద్రతా అవసరాల దృష్ట్యా ప్రైవేట్ సెక్యూరిటీ వ్యవస్థలు, సీసీటీవీ నిఘా వ్యవస్థలు పోలీసు శాఖకు కీలక భాగస్వాములుగా మారుతున్నాయని కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ జోనల్ పోలీసుల ఆధ్వర్యంలో మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కండ్లకోయ సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు, సెక్యూరిటీ గార్డులు, సీసీటీవీ ఆపరేటర్లు నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుమారు 300 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ నేరాల నివారణలో సీసీటీవీ కెమెరాలు, అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది కీలక ఆధారాలుగా నిలుస్తున్నాయని తెలిపారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీస్ రెగ్యులేషన్ యాక్ట్–2005 ప్రకారం ప్రతి ఏజెన్సీ తప్పనిసరిగా నమోదు చేసుకొని చట్టబద్ధంగా కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. సందర్శకుల వివరాల నమోదు, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా, ప్రవేశ ప్రాంతాల్లో కెమెరాల నిరంతర పర్యవేక్షణ వంటి అంశాల్లో నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు, శాంతిభద్రతల పరిరక్షణ, వీఐపీ బందోబస్తు సమయంలో పోలీసు శాఖతో సమన్వయం



కలిగి పనిచేయాలని సూచించారు.అనంతరం పిఎస్ఎఆర్ చట్టంలోని నిబంధనలను వాస్తవ ఘటనల ఉదాహరణలతో వివరించి, భద్రతా వ్యవస్థల బలోపేతానికి ప్రైవేట్ సెక్యూరిటీ రంగం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీసీపీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ పురుషోత్తం, మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఏసీపీ బాల గంగిరెడ్డి, కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, డీఐలు పాల్గొన్నారు.

# సిగాచీ బాధితులకు అండగా బీఆర్ఎస్

- పోస్టర్ ఆవిష్కరించిన బీఆర్ఎస్ నేతలు

**పటాన్చెరు,జూన్ 27(నవజ్యోతి ప్రతినిధి):**

పటాన్చెరు పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన ఘోర పేలుడు ఘటనకు ఏడాది పూర్తవుతున్న సందర్భంగా బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, జూన్ 30న నిర్వహించనున్న సంస్మరణ సభ పోస్టర్‌ను పశమైలారంలో బీఆర్ఎస్ నాయకులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పటాన్చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్, ఇస్నాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మోటే సుమలత పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిగాచీ దుర్ఘటన జరిగి ఏడాది



గడిచినా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.1 కోటి నష్టపరిహారం పూర్తిగా అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పూర్తి నష్టపరిహారం చెల్లించి, ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జూన్ 30న మాజీ మంత్రి హరీష్ రావు పటాన్చెరుకు విచ్చేసి బాధిత కుటుంబాలతో కలిసి సంస్మరణ సభలో పాల్గొని వారికి సంఘీభావం ప్రకటిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి బాధిత కుటుంబాలు, కార్మికులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్వీ నాయకులు మేరాజ్ ఖాన్, మున్సిపల్ కౌన్సిలర్లు మచ్చ కిషోర్ రెడ్డి, బూరిగారి నరేందర్ రెడ్డి, వడ్డెగడ్డ రాజు, గొంగోళ్ల నవీన్ రెడ్డి, పెలిమెల వెంకటేష్, కో–ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, బండ రాజు, ఐలాపూర్ మాణిక్ యాదవ్, పాశంమైలారం గ్రామ అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌జీకే కాలనీకి శాశ్వత స్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌కు వినతిపత్రం
- కలెక్టర్, జోనల్ కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్న డీసీసీ అధ్యక్షుడు

**దమ్మాయిగూడ, జూన్ 27 (వార్తా ప్రతినిధి):**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని ఆర్‌జీకే కాలనీకి శాశ్వత స్మశాన వాటిక ఏర్పాటు చేసి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాల నాయకులు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌ను శనివారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆర్‌జీకే కాలనీలో శాశ్వత స్మశాన వాటిక లేకపోవడంతో స్థానిక ప్రజలు అంత్యక్రియల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా శ్మశానవాటికతో పాటు రహదారి, విద్యుత్, తాగునీరు, షెడ్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సమస్యపై సానుకూలంగా స్పందించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడి శాశ్వత స్మశాన వాటిక ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌తో చర్చించి అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని భరోసా



ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముప్పరామారావు, మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేతా రాజు ముదిరాజ్, మాల మహానాడు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గుజ్జుక పరశురాం, దమ్మాయిగూడ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కృష్ణారావు,ఆర్‌జీకే కాలనీ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఈగ రాజు, నరేష్, సాయిరెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ పోలీసుల కీలక ముందడుగు

- ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు, సీసీటీవీ వెండార్లతో అవగాహన సదస్సు

**మేడ్చల్, జూన్ 27(నవజ్యోతి ప్రతినిధి)**

ప్రజా భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా సైబరాబాద్ పోలీసులు కీలక సమావేశాన్ని నిర్వహించారు. మేడ్చల్ పరిధిలోని కండ్లకోయలో ఉన్న సిఎమ్ఆర్ (సీఎంర్ ) టెక్నికల్ క్యాంపస్‌లో, క్యూత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు, సెక్యూరిటీ గార్డులు మరియు సీసీటీవీ వెండార్ల కోసం ప్రత్యేక అవగాహన మరియు సన్నద్ధత (సెన్సిటైసేషన్) సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో, క్యూత్బుల్లాపూర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ )ఎన్. కోటి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సులో దాదాపు 300 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. నేరాల నియంత్రణలో ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది మరియు సీసీటీవీ వెండార్ల పాత్ర ఎంతో కీలకమని డీసీపీ ఎన్. కోటి రెడ్డి పేర్కొన్నారు. పోలీసులు, ప్రైవేట్ సెక్యూరిటీ వ్యవస్థల మధ్య సమన్వయం ఉంటేనే నేరాలను సమర్థవంతంగా అడ్డుకోగలమని ఆయన స్పష్టం చేశారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీస్ రెగ్యులేషన్ యాక్ట్ (ప్సరా), 2005' నిబంధనలను ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు ఖచ్చితంగా పాటించాలని ఆయన ఆదేశించారు.పౌరుల రక్షణ మరియు భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని




సూచించారు.ఈ కార్యక్రమంలో క్యూత్బుల్లాపూర్ జోన్ అడిషనల్ డీసీపీ శ్రీ పురుషోత్తం, మేడ్చల్ డివిజన్ ఏసీపీ శంకర్ రెడ్డి, క్యూత్బుల్లాపూర్ డివిజన్ ఏసీపీ బాల గంగిరెడ్డిలతో పాటు జోన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. పోలీస్ యంత్రాంగం మరియు సెక్యూరిటీ భాగస్వాముల మధ్య సహకారాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

**ఉమ్మడి మెదక్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సూచించారు. శనివారం నారాయణఖేడ్ మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు.అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశమైన ఎమ్మెల్యే గత విద్యా ఫలితాలను సమీక్షించారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ఎందుకు తక్కువగా ఉందని ఆరా తీసి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల నమోదు (ఎన్‌రోల్‌మెంట్) పెంచేందుకు ప్రజల్లో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచే చర్యలు చేపట్టాలన్నారు.పాఠశాలలో మౌలిక వసతులపై కూడా చర్చించిన ఎమ్మెల్యే, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా టాయిలెట్లు సహా అత్యవసర వసతులను త్వరితగతిన ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, మాజీ ఎంపీటీసీ పండరి రెడ్డి, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



# దేవేందర్ నగర్ లో రోడ్డు ఆక్రమణల తొలగింపు




- పోలీస్ సమన్వయంతో సాగిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమం
- ఆక్రమణదారులకు అధికారుల వార్నింగ్

**కుత్బుల్లాపూర్, జూన్ 27: (నవజ్యోతి ప్రతినిధి)**

సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు గాజులరామారం సర్కిల్ పరిధిలోని దేవేందర్ నగర్ ప్రధాన రహదారిపై ఉన్న ఆక్రమణలను శనివారం అధికారులు తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించేందుకు పోలీస్ శాఖ సమన్వయంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.రోడ్డుపై ఏర్పాటుచేసిన అక్రమ నిర్మాణాలు, వ్యాపార విస్తరణలను తొలగిస్తూ అధికారులు చర్యలు చేపట్టారు.ప్రభుత్వ రహదారులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తూ, ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఆర్. సుమిత్ర, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ బి. సరిత సేన్ తమ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు.

# అత్యవసర శస్త్రచికిత్సతో మహిళ ప్రాణాలు కాపాడిన వైద్యులు

**పటాన్చెరు, జూన్ 27(నవజ్యోతి ప్రతినిధి):**

చందానగర్‌లోని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరిన 34 ఏళ్ల మహిళకు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా ప్రాణాలు కాపాడారు.నెలసరి ఆలస్యం, తీవ్రమైన కడుపు నొప్పి, నీరసం, అస్వస్థతతో బాధపడుతున్న మహిళను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకురాగా, పరీక్షల్లో ఆమె రక్తపోటు ప్రమాదకర స్థాయికి పడిపోవడం, గుండె స్పందన అధికంగా ఉండటం గుర్తించారు. వెంటనే ఐసీయూకు తరలించి అత్యవసర చికిత్స ప్రారంభించారు.తదుపరి పరీక్షల్లో గర్భాశయం వెలుపల పిండం పెరుగుతున్న ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ కారణంగా ఫెలోపియన్ ట్యూబ్ పగిలి, కడుపులో భారీగా రక్తస్రావం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంటనే శస్త్రచికిత్స నిర్వహించి పగిలిపోయిన ట్యూబ్‌ను తొలగించి, సుమారు 2 లీటర్ల వరకు పేరుకుపోయిన రక్తాన్ని బయటకు తీసి రక్తస్రావాన్ని నియంత్రించారు.డా. భావ్య నేతృత్వంలోని ప్రసూతి & గైనకాలజీ బృందం శస్త్రచికిత్స నిర్వహించగా, డా. రాజు ఆధ్వర్యంలోని క్రిటికల్ కేర్ బృందం ఐసీయూలో ప్రత్యేక చికిత్స అందించింది. వివిధ విభాగాల వైద్యుల సమన్వయంతో రోగి క్రమంగా కోలుకుని పూర్తిగా ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ మహిళల ప్రాణాలకు ముప్పు కలిగించే అత్యవసర పరిస్థితి అని తెలిపారు. నెలసరి ఆలస్యం, తీవ్రమైన కడుపు నొప్పి, తలతిరగడం, బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో గుర్తించి చికిత్స అందించడం వల్లే మహిళ ప్రాణాలను కాపాడగలిగామని వెల్లడించారు.



# ఎమ్మెల్యేను కలిసిన జిన్నారం రైతు సహకార సంఘ నూతన కార్యవర్గం

**పటాన్చెరు(జిన్నారం), జూన్ 27(నవజ్యోతి ప్రతినిధి):**

జిన్నారం మండలంలో నూతనంగా ఏర్పాటైన రైతు సహకార సంఘం కార్యవర్గ సభ్యులు శనివారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సంఘం ఏర్పాటు, లక్ష్యాలు, రైతుల సంక్షేమం కోసం చేపట్టనున్న కార్యక్రమాల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. రైతుల అభివృద్ధి కోసం సంఘం చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అలాగే ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ కుంచాల ప్రభాకర్, రైతు సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు పర్వతాలు యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వంగేటి రాజిరెడ్డి, కోశాధికారి నరసింహారెడ్డి, కార్యవర్గ సభ్యులు గవిండ్ల రంగారెడ్డి, తోట సంజీవ, గాండ్ల బ్రహ్మేందర్, పుట్టి వెంకటేష్, సీత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# శివంపేట మండలంలో పేకాట స్థావరాలపై దాడి

**శివంపేట జూన్ 27 నవజ్యోతి ప్రతినిధి ఆకుల శ్రీనివాస్**

గంగాయిపల్లి అటవీ ప్రాంతంలో పేకాట తావులపై శివంపేట పోలీసుల దాడి: ఐదుగురు నిందితుల అరెస్ట్, రూ. 11,230 నగదు స్వాధీనం

**శివంపేట:**

శివంపేట మండలం గంగాయిపల్లి గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా చట్టవిరుద్ధంగా పేకాట ఆడుతున్న స్థావరంపై శివంపేట పోలీసులు శనివారం (ఈరోజు) మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా, వారి వద్ద నుండి రూ. 11,230/- ల నగదుతో పాటు 5 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**అరెస్ట్ అయిన నిందితుల వివరాలు:**

1. **ఇటిక్యాల రేవంత్ రెడ్డి** (తండ్రి: ముత్యం రెడ్డి, వయస్సు: 40 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: తూప్రాన్)
2. **బానోత్ కాండ్యా** (తండ్రి: కిష్టయ్య, వయస్సు: 32 సంవత్సరాలు, వృత్తి: వ్యవసాయం, నివాసం: చండీ తండా, శివంపేట మండలం)
3. **నల్ల పెరమాండ్లు** (తండ్రి: నారాయణ, వయస్సు: 58 సంవత్సరాలు, వృత్తి: వ్యవసాయం, నివాసం: దొంతి గ్రామం, శివంపేట మండలం)
4. **జిట్టా సత్యనారాయణ**(తండ్రి: లచ్చయ్య, వయస్సు: 45 సంవత్సరాలు, వృత్తి: వ్యవసాయం, నివాసం: మగ్దూంపూర్ గ్రామం, శివంపేట మండలం)
5. **ఎ. ప్రశాంత్** (తండ్రి: రాములు, వయస్సు: 31 సంవత్సరాలు, వృత్తి: వ్యవసాయం, నివాసం: శభాష్‌పల్లి గ్రామం, శివంపేట మండలం)

**కేసు వివరాలు:**

గంగాయిపల్లి గ్రామ అటవీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు గుమిగూడి డబ్బులతో జూదం (పేకాట) ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం



రావడంతో శివంపేట పోలీసులు తనిఖీలు చేపట్టారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన ఐదుగురు నిందితులను సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల వద్ద నుండి రూ. ★11,230/-★ ల నగదు, ★5 మొబైల్ ఫోన్లు★ మరియు పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై చట్టపరమైన నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు జరుపుతున్నట్లు శివంపేట ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు. ఇట్టి దాడిలో ఎస్ఐ గారితో పాటు హెడ్ కానిస్టేబుల్ ధర్మయ్య కానిస్టేబుల్ శేఖర్ హోంగార్డ్ వీరస్వామి పాల్గొన్నారు.

**పోలీస్ హెచ్చరిక:**

మండల పరిధిలో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడినా, జూదం, పేకాట వంటి వ్యసనాలతో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్సై మధుకర్ రెడ్డి కోరారు.

# ఎస్ఐఆర్.-2026 సమస్యలపై ఆల్ పార్టీ సమావేశం



- **కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల చర్చలు**

**కుత్బుల్లాపూర్, జూన్ 27: (నవజ్యోతి ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్.ఐ.ఆర్.-2026 ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించిన సమస్యలు, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు, దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో పారదర్శకత వంటి అంశాలపై కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలో శనివారం ఆల్ పార్టీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వివిధ పార్టీ ప్రతినిధులు జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌ను కలిసి ఎస్.ఐ.ఆర్.-2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. ఓటరు జాబితాలో పేర్ల తొలగింపులు, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు వంటి అంశాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంచడం, ప్రత్యేక శిబిరాల నిర్వహణ, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది. అధికారులు అన్ని రాజకీయ పార్టీల సూచనలను స్వీకరించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, రాజ్‌కుమార్, బైరిష్ గౌడ్, వేణు ముదిరాజ్, కిషోర్ ముదిరాజ్, అనిల్, గణేష్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన భానూరు కాంగ్రెస్ కీలక నాయకులు

**పటాన్చెరు, జూన్ 27(నవజ్యోతి ప్రతినిధి):**

పటాన్చెరు మండలం భానూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కీలక నాయకులు, ప్రజాప్రతినిధులు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు సమక్షంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు ప్రవళిక నరేందర్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాగర్, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కుమ్మరి శివయ్య తమ అనుచరులతో కలిసి గులాబీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నూతనంగా పార్టీలో చేరిన నాయకులకు



శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ విధానాలు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వం, హరీష్ రావు నేతృత్వానికి ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు.పటాన్చెరు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీకి బలమైన కంచుకోటగా నిలిచిందని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు బీఆర్ఎస్‌లో చేరడం ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై అసంతృప్తిగా ఉన్నారనే విషయాన్ని సూచిస్తోందన్నారు.ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలను బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని తెలిపారు. ఈ చేరికలతో భానూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే జీఎంఆర్ అభిప్రాయపడ్డారు.

# గుంతల రోడ్లపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ స్పందన

- **నాగారం–దమ్మాయిగూడ రహదారిపై గుంతలకు తాత్కాలిక మరమ్మతులు**
- **ప్రజల ప్రాణాలు కాపాడేందుకే ఈ చర్య అంటూ నాయకుల వెల్లడి**
- **పదవుల్లో ఉండటం నాయకత్వం కాదు...**
- **ప్రజల కష్టాల్లో అండగా నిలబడటమే నిజమైన నాయకత్వం"**

**నాగారం,జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

నాగారం–దమ్మాయిగూడ ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకత్వం స్పందించింది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని రహదారిపై ప్రమాదకరంగా మారిన గుంతలను పార్టీ ఆధ్వర్యంలో తాత్కాలికంగా పూడ్చివేసి మరమ్మతులు చేపట్టారు.ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా జాయింట్ కార్యదర్శి గంధ్ర కమలాకర్ పటేల్, పార్టీ నాయకుడు కోదూరి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, గత నాలుగు నుంచి ఐదు సంవత్సరాలుగా ఈ రహదారి అధ్వాన్నంగా మారినా పాలకులు, సంబంధిత అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. గుంతల కారణంగా ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగినప్పటికీ శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు.ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడకూడదనే ఉద్దేశంతో తాత్కాలికంగా గుంతలను పూడ్చివేసినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నాగారం–దమ్మాయిగూడ ప్రధాన రహదారిని



శాశ్వతంగా నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ సందర్భంగా స్థానికులు తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకుల చొరవను అభినందించారు.

# చక్రిపురం చౌరస్తాలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ

- **రోడ్డుపాలవుతున్న మంచినీరు – వెంటనే మరమ్మతులు చేపట్టాలని కాలనీ కమిటీల సమాఖ్య విజ్ఞప్తి**
- **విలువైన తాగునీరు వృథా కాకుండా జలమండలి అధికారులు స్పందించాలని డిమాండ్**

**కాప్రా, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి) :**



కాప్రా సర్కిల్ పరిధిలోని చక్రిపురం చౌరస్తాలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ కారణంగా భారీగా మంచినీరు రోడ్డుపాలవుతోంది. పలురోజులుగా లీకేజీ కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పైప్‌లైన్ నుంచి నిరంతరం నీరు వృథాగా ప్రవహిస్తూ రహదారిపై నిల్వ ఉండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు విలువైన తాగునీరు వృథా కావడంతో ప్రజలు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కాప్రా సర్కిల్ కాలనీ కమిటీల సమాఖ్య (సీసీఎస్) జలమండలి అధికారులను కోరింది. లీకేజీని అత్యవసరంగా మరమ్మతు చేసి తాగునీటి వృథాను అరికట్టడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.చక్రిపురం చౌరస్తా వంటి రద్దీ ప్రాంతంలో లీకేజీ కొనసాగితే రహదారి దెబ్బతినడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీ కమిటీల సమాఖ్య డిమాండ్ చేసింది.

# రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ప్రభుత్వ పాఠశాలను వెంటనే ప్రారంభించాలి

- **6,240 కుటుంబాల విజ్ఞప్తి – విద్యకు దూరమవుతున్న చిన్నారులు**
- **ఉపాధ్యాయులు, మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వానికి వినతి**

**నాగారం, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)ను తక్షణమే ప్రారంభించి విద్యార్థులకు విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు. గత విద్యా సంవత్సరంలో కాలనీలో ప్రభుత్వ పాఠశాల నిర్వహించగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు



పాఠశాల ప్రారంభం కాకపోవడంతో చిన్నారుల చదువుకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) మారినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. పాఠశాల ప్రారంభం కాకపోవడంతో చిన్నారులు ఇంటి వద్దనే ఉండిపోవడం లేదా రోడ్లపై తిరుగుతూ విలువైన విద్యా సమయాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఇది వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో సుమారు 6,240 కుటుంబాలు నివసిస్తున్నాయని, వీరిలో ఎక్కువ మంది ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందినవారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చదివించే స్థోమత లేక ప్రభుత్వ పాఠశాలపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు.అందువల్ల ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖ అధికారులు, సంబంధిత శాఖలు వెంటనే స్పందించి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించడంతో పాటు అవసరమైన ఉపాధ్యాయులు, సిబ్బంది, బెంచీలు, డెస్కులు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని కాలనీ ప్రజలు డిమాండ్ చేశారు. చిన్నారుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ విజ్ఞప్తిని తెలంగాణ రాంపల్లి 2బీహెచ్‌కే దేవాలయ కమిటీ సంరక్షకుడు మోహన్ ప్రసాద్ రెడ్డి, చైర్మన్ వెంకట్, ప్రధాన కార్యదర్శి కాంపల్లి రవి ఆధ్వర్యంలో రాంపల్లి 2బీహెచ్‌కే కాలనీ ప్రజల తరఫున ప్రభుత్వానికి సమర్పించారు.

# కుషాయిగూడలో బీఎల్‌వోలతో కలిసి క్షేత్రస్థాయి సర్వే

- **ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్**
- **అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని వెల్లడి**

**కుషాయిగూడ, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి) :**

కుషాయిగూడ డివిజన్ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ శనివారం బీఎల్‌వోలతో కలిసి పలు పోలింగ్ కేంద్రాల పరిధిలో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నమోదు, మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర వివరాల సవరణపై బీఎల్‌వోలతో కలిసి ఇంటింటి సర్వే చేపట్టారు. ఓటరు జాబితా పూర్తిస్థాయిలో ఖచ్చితంగా ఉండేలా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ, "ఓటరు జాబితాలో ఒక్క అర్హుడూ మిస్ కాకూడదు. ప్రతి అర్హ పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే మా లక్ష్యం. బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ వంద శాతం ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందిస్తాం" అని అన్నారు.ప్రజలు తమ ఓటరు కార్డులోని వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, ఏవైనా పొరపాట్లు ఉంటే వెంటనే సంబంధిత బీఎల్‌వోలకు తెలియజేసి సవరణలు చేయించుకోవాలని సూచించారు.ఈ



సర్వేలో బూత్ నంబర్–87 బీఎల్‌వో శ్రీనివాస్, బూత్ నంబర్–97 బీఎల్‌వో సిరీష, బూత్ నంబర్–89 బీఎల్‌వో రేణుకతో పాటు బీఎల్‌వోలు నీరజ రెడ్డి, రామరెడ్డి, భానునేత పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాసుల సతీష్ గౌడ్, యువ నాయకులు రాగిడి సాకేత్ గౌడ్, హీరాలాల్ నాయక్, భాను తదితరులు పాల్గొన్నారు.

# అడుగడుగునా గుంతలే... ప్రజల ప్రాణాలతో చెలగాటమా?

- శంకర్ పల్లి– వికారాబాద్ - మోమిన్ పేట్ ప్రధాన రహదారి దుస్థితిపై తీవ్ర ఆగ్రహం...
- గుంతలతో నరకం అనుభవిస్తున్న వాహనదారులకు విముక్తి కల్పించండి...
- నిద్రపోతున్న ఆర్ అండ్ బి అధికారులు – మాటలకే పరిమితమైన పాలకులు...
- వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలి బీఆర్ఎస్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు నాయక్...





**ఉమ్మడి రంగారెడ్డి, జూన్ 27, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**

ప్రజల ప్రాణాలు పణంగా పెట్టినా అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్టే లేదనే విమర్శలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. శంకర్ పల్లి మండలంలోని మహాలింగాపురం నుండి లక్ష్మారెడ్డిగూడెం వరకు ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి వాహనదారులకు నరకయాతనగా మారింది. అడుగడుగునా ఏర్పడిన భారీ గుంతలు ప్రమాదాలకు నిలయాలుగా మారినా, సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఏళ్లు గడుస్తున్నా మారని పరిస్థితి – స్పందించని అధికారులు...**

రహదారి మరమ్మతుల కోసం ప్రజలు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా అధికారులు మాత్రం కేవలం హామీలకే పరిమితమయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. నాణ్యత లేకుండా చేపట్టిన పనుల కారణంగా కొద్ది రోజులకే రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, నిర్లక్ష్య వైఖరి కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రజలు అంటున్నారు.

**వికారాబాద్, మర్పల్లి, బంటారం ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గమే దారుణ స్థితిలో...**

ఈ రహదారి గుండా ప్రతిరోజూ వందలాది ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, అత్యవసర సేవల కోసం వెళ్లే ప్రజలు ఇదే రహదారిని ఉపయోగిస్తున్నారు. అయితే ప్రస్తుతం రోడ్డు పూర్తిగా గుంతలతో నిండిపోవడంతో ప్రయాణం అంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.

**ప్రతి రోజు ప్రమాదాల భయం – నడుం నొప్పులు, వాహనాలకు భారీ నష్టం...**

లక్ష్మారెడ్డిగూడెం గ్రామ ప్రజలు తప్పనిసరిగా ఈ రహదారిపైనే ప్రయాణించాల్సి వస్తోంది. భారీ గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు తరచూ అదుపుతప్పి పడిపోతున్నారు. వాహనాల విడిభాగాలు త్వరగా పాడవుతుండగా, ప్రయాణికులు నడుం నొప్పులు, శారీరక ఇబ్బందులతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకర పరిస్థితులు మరింత పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజల పన్నుల డబ్బు ఎక్కడ ఖర్చవుతోంది? – ప్రజల్లో ఆగ్రహం...**

ప్రజలు పన్నులు కడుతున్నా కనీస రహదారి సౌకర్యం కల్పించలేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు. రహదారుల మరమ్మతులకు కేటాయిస్తున్న నిధులు ఎక్కడ ఖర్చవుతున్నాయో అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి...**

జిల్లా కలెక్టర్, ఆర్ అండ్ బి ఉన్నతాధికారులు, సంబంధిత ప్రజాప్రతినిధులు తక్షణమే ఈ రహదారిని పరిశీలించి మహాలింగాపురం–లక్ష్మారెడ్డిగూడెం రహదారికి అత్యవసరంగా మరమ్మతులు చేపట్టాలని, అవసరమైతే పూర్తిస్థాయిలో నూతన రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రజల ప్రాణాల కంటే విలువైనది ఏదీ లేదు. మరొక ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

**బీఆర్ఎస్ పార్టీ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు నాయక్ మాట్లాడుతూ...**

"మహాలింగాపురం–లక్ష్మారెడ్డిగూడెం ప్రధాన రహదారి చాలా కాలంగా అధ్వాన్నంగా మారింది. ఈ రోడ్డుపై ప్రతిరోజూ ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతల కారణంగా వాహనదారులు ప్రమాదాల భయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ ఇప్పటివరకు ఏ నాయకుడు గానీ, సంబంధిత అధికారులు గానీ ఈ సమస్యను పట్టించుకోకపోవడం బాధాకరం. ఇకనైనా అధికారులు వెంటనే స్పందించి రహదారిని మరమ్మతు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారకముందే ఈ రహదారిని పూర్తిస్థాయిలో బాగు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను." అని అన్నారు.

# లక్ష్మీనారాయణ కాలనీలో రూ.90 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

- కాలనీవాసుల విజ్ఞప్తికి స్పందించిన మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి
- నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్

**ఉప్పల్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

ఉప్పల్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనారాయణ కాలనీలో సుమారు రూ.90 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను శనివారం ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పరిశీలించి, పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఇటీవల లక్ష్మీనారాయణ కాలనీ వాసులు రోడ్ల దుస్థితిని మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో చర్చించి సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా కృషి చేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీవాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి తన వంతు కృషి కొనసాగిస్తానని తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత కాలనీలో రాకపోకలు సులభతరమవడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు కూడా తొలగిపోతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ కాలనీ అధ్యక్షుడు లూకాస్, సురేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మురళి రెడ్డి, నాగరాజు, సుధాకర్, హరి, అశోక్ గౌడ్, నిరంజన్, నాగేశ్వరరావు, రవి వర్మ, దుర్గాప్రసాద్, రామారావు, వల్లూరి శ్రీను,



అచ్చిరెడ్డి, పెద్ద ప్రసాద్, చిన్న ప్రసాద్, మధుబాబు, పరమేష్, మీసాల రాములు, బ్రహ్మచారి, బిక్షపతి, నరసింహాచారి, శ్రీహరిచారి, పాండురంగాచారి, రాజు, కృష్ణ, మోహన్ బాబు, నాగేష్, ఇస్మాయిల్, ఖాదర్ వల్లి, మదర్, భాస్కర్ దాస్, వేణు, వెంకటేష్, సీహెచ్ కుమార్, నాగేశ్వరరావు, సీసీ రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, సందీప్, భాస్కర్‌తో పాటు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# స్వీట్‌వన్ స్వీట్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

- డాక్టర్ ఏ.ఎస్.రావు నగర్‌లో నూతన స్వీట్ దుకాణం ప్రారంభం
- స్థానిక యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు రావడం అభినందనీయం - ఎమ్మెల్యే

**ఏ.ఎస్.రావు నగర్, జూన్ 27,(నవజ్యోతి ప్రతినిధి) :**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని డాక్టర్ ఏ.ఎస్.రావు నగర్‌లో శ్రీరామ్ నగర్, రాధికా థియేటర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన "స్వీట్‌వన్" స్వీట్ షాప్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం దుకాణాన్ని



పరిశీలించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్థానిక యువత స్వయం ఉపాధి రంగంలో అడుగుపెట్టి కొత్త వ్యాపారాలను ప్రారంభించడం సంతోషకరమైన విషయమని అన్నారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.ప్రజలకు నాణ్యమైన స్వీట్లు, పరిశుభ్రమైన వాతావరణంలో సరసమైన ధరలకు అందిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించాలని షాప్ యాజమాన్యానికి సూచించారు. నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తే వ్యాపారం మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.షాప్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే, వ్యాపారం విజయవంతంగా కొనసాగి మరింత విస్తరించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు,బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమశేఖర్ రెడ్డి,మహిపాల్ రెడ్డి,కుమారస్వామి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

- దుర్గానగర్ దేవాలయంలో ప్రత్యేక పూజలు – రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు
- ఆధ్యాత్మిక కార్యక్రమాలు భారతీయ సంస్కృతి పరిరక్షణకు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే వ్యాఖ్య

**నాచారం, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారం డివిజన్ పరిధిలోని దుర్గానగర్ లో శ్రీ కాశీ విశ్వేశ్వర దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని దేవుడిని ప్రార్థించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేవాలయాల్లో నిర్వహించే ధార్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడమే కాకుండా భారతీయ సంస్కృతి, సనాతన



సంప్రదాయాల పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని అన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం, నైతిక విలువలు పెంపొందేందుకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సాయి జెన్, మేడల మల్లికార్జున్ గౌడ్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ కార్యాలయంలో పాము కలకలం

**ఉమ్మడి మెదక్ జిల్లా (నవజ్యోతి ప్రతినిధి)జూన్ 27/**



అల్లాదుర్గంమండల కేంద్రమైన ఐసిడిఎస్ కార్యాలయంలో శనివారం పాము కలకలం లేపింది. ఉదయం కార్యాలయ తలుపులు తెరవగానే పాము కనిపించడంతో ఐసిడిఎస్ సిబ్బంది భయాందోళనలకు గురయ్యారు. ఆపాము అంగన్వాడి కేంద్రాలకు పంపిణీ చేసే చిన్నారిల కు పంపిణీ చేసే దుస్తుల్లోకి వెళ్లడంతో సిబ్బంది కర్ర సాయంతో పామును బయటకు పారద్రోలారు. దీంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

## బొల్లారం డివిజన్ లో ఇంటింటికీ ఎస్ ఐఆర్ దరఖాస్తుల పంపిణీ

**పటాన్చెరు, జూన్ 27(నవజ్యోతి ప్రతినిధి):**



బొల్లారం డివిజన్‌లో శనివారం ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ ఫారాలను ప్రజలకు అందజేస్తూ, వాటిని సక్రమంగా నింపి నిర్ణీత గడువులోపు సమర్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమం డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కొనసాగుతోందని తెలిపారు.

## మచ్చ బొల్లారం డివిజన్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన

### మాజీ కార్పొరేటర్

**అల్వాల్/జూన్ 27,(నవ జ్యోతి ప్రతినిధి):-**



మచ్చ బొల్లారం 190&191 డివిజన్ పరిధిలోని శనివారం మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ నాయకులతో కలిసి పర్యటించి కృష్ణా నగర్ లో దెబ్బతిన్న రహదారికి ₹ 20 లక్షల విలువైన సి.సి రోడ్డు పనులను ప్రారంభించి స్నేహ కాలనీ నుంచి శివ నగర్ లింక్ రోడ్డు వరకు కనెక్టింగ్ సీసీ రోడ్డు శంకుస్థాపన ప్రారంభించారు.మాజీ కార్పొరేటర్ జితేందర్ నాథ్ మాట్లాడుతూ ఇవి పాత కాలనీలు అయినప్పటికీ,ఈ ప్రాంతాలు ఇప్పుడు పూర్తిగా అభివృద్ధి చెంది జనసాంద్రతతో ఉన్నాయి.సురక్షితమైన రాకపోకలు మెరుగైన కనెక్టివిటీ ప్రజలకు సులభతరమైన కదలికను నిర్ధారించడానికి నివాసితులు ఈ రహదారి మెరుగుదలలను నిరంతరం అభ్యర్థిస్తున్నారు.అనంతరం సాయి సూర్య కాలనీ ఫేజ్–2లో సుమారు 550 చదరపు గజాలలో 21 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణం ప్రారంభించారు. భూమిని ఇంతకుముందు హైడ్రా రక్షించింది సరిహద్దు గోడ నిర్మాణం ఆస్తిని రక్షించడంలో మరియు భవిష్యత్తులో ఆక్రమణలను నిరోధించడంలో సహాయపడుతుంది.పనులు చేపట్టడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు సాంబశివరావు, శ్రీనివాస్‌రావు,ఎస్ఎల్ రాజ్,సురేష్,మధుసూదన్ రెడ్డి,నారాయణరావు, అబ్దుల్ ఖయ్యూమ్, అనిత,ఇంద్ర,అరుణ, లక్ష్మణ్,రమేష్,వెంకట్, పవన్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి,శ్రీశైలం,లడ్డురెడ్డి, శ్రీనివాస్ గౌడ్,దేవ గౌస్, డి.స్వామి,చింటు, బాలయ్య,ముత్యాలు, వెంకటేష్ గౌడ్,సురేందర్, బిక్షపతి,వెంకటేష్, హనుమంతు,లక్ష్మీబాయి,మీరాబాయి,శ్రీనివాస్ గౌడ్,సంపత్ యాదవ్, రాజ్ కుమార్,మహేష్, యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

## కాట్రీయల్ గ్రామం లో వర్షా లు సమృద్ధిగా కురవాలని హనుమంతునికి నీళ్లాభిషేకం.

**రామాయంపేట జూన్ 27 నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**



రామాయంపేట మండలం కాట్రియాల్ గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో శ్రీ ఆంజనేయస్వామికి భక్తిశ్రద్ధలతో నీళ్లాభిషేకం నిర్వహించారు. గ్రామంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతుల పంటలు పుష్కలంగా పండాలని ఆకాంక్షిస్తూ ఈ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, మంచి వర్షాలు కురిసి వ్యవసాయం అభివృద్ధి చెందాలని కోరుకుంటూ ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జొన్న రైతుల సమస్యలు పరిష్కరించాలి

### సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ.

**రామాయంపేట, జూన్ 27 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**



రామాయంపేట మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ప్రాంగణంలో శనివారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జొన్న రైతుల సమస్యల పరిష్కారం కోసం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు నీలం బాబు మాట్లాడుతూ, ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన జొన్నలు తడిసిపోయే ప్రమాదం ఉందన్నారు. సరైన గోదాములు, బార్దానా (గోనె సంచులు) అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే తగిన నిల్వ సౌకర్యాలు కల్పించి, జొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే త్వరలో రైతులతో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వం జొన్నలను కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే రైతుల తరపున పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, జొన్న రైతులు పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

# లక్ష్మాపూర్ లో ముమ్మరంగా ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం.

## ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ

**రామాయంపేట, జూన్ 27 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**

రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. గ్రామ సర్పంచ్ గొల్లపల్లి నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తూ, ఓటర్ల వివరాల సేకరణ చేపట్టారు.18 సంవత్సరాలు పూర్తి చేసిన అర్హులైన కొత్త ఓటర్ల నమోదు,చిరునామా మార్పులు, పేర్లు, ఇతర వివరాల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి కుటుంబం తమ వివరాలను సక్రమంగా నమోదు చేసి, అవసరమైన పత్రాలను బీఎల్‌వోలకు అందించాలని సూచించారు.గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు జాబితాను తప్పులులేకుండా సిద్ధం చేయడమే ఈ ప్రత్యేక కార్యక్రమం లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు, గ్రామ ప్రజలు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జొన్నరైతుల సమస్యలపై కలెక్టర్‌ను కలిసిన సీపీఎం నేతలు.

## కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేస్తామని హామీ కలెక్టర్ ప్రతిమా సింగ్.

**రామాయంపేట జూన్ 27 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**

జొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ను కలిసి వినతిపత్రం అందజేశారు. రామాయంపేట వ్యవసాయ మార్కెట్‌లో జొన్న కొనుగోళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులు, గోదాముల కొరత, బార్దానా లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పందిస్తూ, జొన్న కొనుగోలు ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని, గోదాములు, బార్దానా తదితర సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొనుగోలు కేంద్రాల్లో జొన్నల కొనుగోలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నీలం బాబు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ బలోపేతానికి కృషి చేస్తా

## దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు మస్కూరి బాలరాజ్.

## కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరుస్తాం.

**రామాయంపేట, జూన్ 27 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ )**

గ్రామీణ ప్రాంతాల్లో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడానికి నిరంతరం కృషి చేస్తానని బీజేపీ దళిత మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షుడు మస్కూరి బాలరాజ్ అన్నారు.రామాయంపేట బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు, మహిళలు, యువత, పేదల సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి వాటి ప్రయోజనాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా పనిచేస్తామని చెప్పారు.మెదక్ జిల్లా కేంద్రంలో జరగనున్న బీజేపీ జిల్లా నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ మోర్చాల పదాధికారులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

# పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలి

## సాయిపేట శ్రీనివాస్

**మేడ్చల్ , జూన్ 27(నవజ్యోతి ప్రతినిది)**

దేశం నుండి పోలియోను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గుండ్లపోచంపల్లి 299 డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ పిలుపునిచ్చారు.రేపు (జూన్ 28, ఆదివారం) జరిగే కార్యక్రమంలో 5 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు. గతంలో చుక్కలు వేయించినప్పటికీ, ఈ ప్రత్యేక కార్యక్రమంలో మరోసారి వేయించడం ద్వారా పిల్లలకు మరింత రక్షణ లభిస్తుందని తెలిపారు. సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలు లేదా పోలియో బూత్‌లకు వెళ్లి, రెండు చుక్కలు – జీవితాంతం రక్షణ నినాదంతో పిల్లల భవిష్యత్తును కాపాడుకోవాలని ప్రజలకు సూచించారు.

# తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఉద్యమకారుల సమావేశం

**ఆందోల్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి) :**

సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన జిల్లా ఇంచార్జి మాసన్నగారి బాలయ్య ఆధ్వర్యంలో ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు.తెలంగాణ తొలి దశ మరియు మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్,తెలంగాణ రక్షణ సేన జిల్లా ఇంచార్జ్ మరియు అందోల్ నియోజకవర్గ ఇంచార్జి మాసన్నగారి బాలయ్య గౌరవంగా సన్మానించారు. జులై 2న హైదరాబాదులో తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత గారి అధ్యక్షతన జరుగనున్న భూపోరాటం కార్యక్రమంలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులరు ఇళ్ల స్థలాలు కేటాయిస్తం అని ఇచ్చిన హామిని నెరవేర్చాలని తమ ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ కారులకు ఇళ్ల స్థలాలను వెంటనే కేటాయించలని డిమాండ్ చేసారు, ప్రతి ఒక్క ఉద్యమకారుడు భూపోరాటం కార్యక్రమంలో పాల్గొని తమ గళం వినిపించగలరని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు ఎం.డి ఖలీల్,నారాయణ గౌడ్, బుడోళ్ళ కిష్టయ్య, గడ్డమిడి రాములు, సాబోధి పర్వయ్య, గుండెగళ్ల నర్సింలు, బేగరి పెంటయ్య, గట్టుకింది ఆంజనేయులు, ఎర్రగొల్ల ఆంజనేయులు,నగేష్, రాంరెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణలో బీజేపీ ప్రభుత్వమే లక్ష్యం

- **ఈటల రాజేందర్**
- **కాంగ్రెస్ హామీల అమలులో పూర్తిగా విఫలమైంది – ప్రజల్లో తీవ్ర అసంతృప్తి**
- **పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్**
- **కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపు**
- **గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యమన్న బీజేపీ నాయకులు**

**ఘట్కేసర్, జూన్ 27,(నవజ్యోతి ప్రతినిధి):**

మల్కాజిగిరి కార్పొరేషన్ ఘట్‌కేసర్ సర్కిల్ ఏదులాబాద్ డివిజన్ పరిధిలోని ఔషాపూర్ గ్రామంలోని రాక్ ఎన్‌క్లేవ్ కన్వెన్షన్ హాల్‌లో భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణ పర్యటన సందర్భంగా నిర్వహించనున్న ముఖ్య సమావేశానికి విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఏర్పాట్లను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డితో కలిసి పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో భారతీయ జనతా పార్టీ రోజురోజుకు బలోపేతమవుతోందని, రాష్ట్ర ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయపతాకం ఎగురవేసి అధికారంలోకి రావడం ఖాయమనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఈటల రాజేందర్ విమర్శించారు.రైతులు, యువత,మహిళలు,నిరుద్యోగులు,



ఉద్యోగులు, సామాన్య ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంపై దృష్టి సారించలేదన్నారు. హామీలు అమలు కాకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని చెప్పారు. అదే స్ఫూర్తితో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణ పర్యటన రాష్ట్ర పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని అన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్ కార్యాచరణపై కీలక మార్గదర్శనం చేయనున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.తెలంగాణలో గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ పర్యటన నిర్వహిస్తున్నామని పేర్కొంటూ, ప్రతి కార్యకర్త ప్రజల సమస్యలపై పోరాడుతూ పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రం రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తిరుమలరెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గంగారం గ్రామంలో ఆధ్యాత్మిక వైభవం...

## విగ్రహ, యంత్ర ప్రతిష్ఠా మహోత్సవాలకు సర్వం సిద్ధం

**కొండాపూర్, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గంగారం గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామివారి విగ్రహ, యంత్ర ప్రతిష్ఠా మహోత్సవాలు జూలై 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్త బృందం తెలిపారు. ఈ మేరకు శనివారం మహోత్సవాల ఆహ్వాన పత్రికను విడుదల చేసి, భక్తులందరికీ ఆహ్వానం పలికారు.మహోత్సవాల తొలి రోజు జూలై 3న మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, నవగ్రహ పూజలు, ఆవాహిత దేవత హోమాలు నిర్వహించనున్నారు. అనంతరం తీర్థ ప్రసాదం, అన్నప్రసాద వితరణ జరుగుతుంది. సాయంత్రం 4 గంటల నుంచి విగ్రహ మూర్తుల ఊరేగింపు, జలాధివాసం, భజన సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.రెండో రోజు జూలై 4న ఉదయం రుద్ర హోమం, పంచసూక్త హోమం, మూలమూర్తి హోమం, జలాధివాసాంగ హోమాలు నిర్వహిస్తారు. సాయంత్రం మూలమంత్ర హోమం, మహా స్నాపనము, శయ్యాధివాసం, ధాన్య, ఫల, పుష్ప, హిరణ్య పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు.మహోత్సవాల ప్రధాన ఘట్టమైన జూలై 5న ఉదయం మండప ఆవాహిత దేవతా పూజ, కళాన్యాస హోమం, గర్తన్యాసం అనంతరం ఉదయం 8:05 గంటలకు శ్రవణ నక్షత్రయుక్త కర్కాటక లగ్న పుష్కరాంశ శుభ ముహూర్తంలో యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించనున్నారు. అనంతరం నేత్రోన్మీలనం, పూర్ణాహుతి, శాంతి కళ్యాణం, వేద ఆశీర్వచనం, మహాభిషేకం, తీర్థ ప్రసాదం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు కొనసాగనున్నాయి.ఈ మహోత్సవాలు పూజ్య శ్రీ శ్రీ శ్రీ శివయోగి శివాచార్య మహాస్వామి (తంగేడిపల్లి), శ్రీ శ్రీ శ్రీ సోమలింగ శివాచార్య మహాస్వామి (బిచ్కుంద), వైరాగ్య శిఖామణి అవధూత దత్తగిరి మహారాజ్ (బర్దీపూర్), శ్రీ శ్రీ శ్రీ బసవలింగ అవధూత (మల్లయ్యగుట్ట) వారి కరకమలముల మీదుగా అత్యంత




వైభవంగా జరగనున్నాయి.ఈ సందర్భంగా గంగారం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్త బృందం మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ పవిత్ర మహోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తన, మన, ధన, వస్తు రూపేణ సహాయ సహకారాలు అందించి స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమాలకు గ్రామ పురోహితులు పౌరోహిత్యం వహించనున్నట్లు తెలిపారు.

# జూలై 9న వర్కింగ్ జర్నలిస్టుల మహాసభ !

- **జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యాదగిరి, విష్ణు**

**సంగారెడ్డి, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి) :**

సంగారెడ్డి జిల్లా తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యూజేఐజేయు) మహాసభ వచ్చే నెల 9వ తేదీన సంగారెడ్డి లోని టీఎన్జీవో భవన్ లో జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా అర్హులైన వారికి ఇంటి



స్థలం తో పాటు హెల్త్ కార్డును ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని ఎప్పటినుంచో కోరుతున్నామని అన్నారు. ప్రభుత్వాలు మారినప్పటికీ, జర్నలిస్టులకు న్యాయం జరగడం లేదని తెలిపారు. అంతేకాకుండా మిగిలిన వారందరికీ కూడా అక్రిడేషన్ కార్డులను జారీ చేయాల్సిందిగా తమ సంఘం తరఫున డిమాండ్ చేస్తున్నామని వివరించారు. ఈ సమస్యలన్నింటిపై చర్చించడానికి జిల్లా మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని అన్నారు. జూలై 9న ఉదయం 11 గంటలకు మహాసభ ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే పైసల్ తో పాటు సంఘం రాష్ట్ర నేతలు పాల్గొంటారని చెప్పారు.జిల్లా మంత్రి తో పాటు ఎంపీలు ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు కూడా ఈ సమావేశానికి హాజరవుతారని వివరించారు. అందువల్ల జిల్లాలోని జర్నలిస్టులంతా ఈ మహాసభకు తరలి కావాల్సిందిగా కోరారు. జర్నలిస్టుల ఐక్యతను చాటి చెప్పేందుకు సువర్ణ అవకాశమని వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా శాఖ నూతన కమిటీ ఎన్నిక కూడా ఆ రోజు నిర్వహిస్తామని తెలిపారు. అందువల్ల ప్రతి జర్నలిస్టు మహాసభకు హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# సంగారెడ్డి విద్యాసంస్థల అభివృద్ధికి రూ. 5.40 కోట్ల సీఎస్ఆర్ నిధులు

- **శంకుస్థాపన చేసిన టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**

**సంగారెడ్డి, జూన్ 27 (నవ జ్యోతి ప్రతినిధి) :**

సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే లక్ష్యంతో భారీగా నిధులు మంజూరయ్యాయి. టీజీఐఐసీ (TGIIC) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) కింద కేటాయించిన రూ. 5.40 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి శంకుస్థాపన చేశారు. మహిళా డిగ్రీ కళాశాల: విద్యార్థినుల వసతి కోసం రూ. 4 కోట్లతో హాస్టల్ నిర్మాణం, రూ. 75 లక్షలతో నూతన ఆడిటోరియం నిర్మాణం, తారా డిగ్రీ కాలేజ్‌క్యాంపస్ రక్షణ కోసం రూ. 50 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణం.ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ. 15 లక్షలతో విద్యార్థుల సౌకర్యార్థం డైనింగ్ హాల్, కిచెన్ నిర్మాణం. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను పటిష్టం చేసి, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించడమే ధ్యేయంగా ఈ నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ శంకుస్థాపన కార్యక్రమాల్లో సంగారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ కూన వనితా సంతోష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ అరుణ, సునీత, ప్రవీణ మరియు విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# పయనీర్స్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

- **ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దత్తు రెడ్డి**

**సంగారెడ్డి, జూన్ 27 (నవజ్యోతి ప్రతినిధి):**

సంగారెడ్డి జిల్లాలోని పయనీర్స్ పాఠశాల బస్సు చేర్యాల సమీపంలో లోయలోకి దూసుకెళ్లిన ఘటన తీవ్ర ఆందోళన కలిగించిందని, ఈ ప్రమాదానికి సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఏఐఎస్ఎఫ్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి దత్తు రెడ్డి ఆరోపించారు.శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, పయనీర్స్ పాఠశాలలో భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలపై, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని గతంలో పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ప్రమాదం చోటుచేసుకుందని పేర్కొన్నారు.ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రమాదంలో గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు వారి పూర్తి బాధ్యతను పాఠశాల యాజమాన్యమే వహించాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రైవేట్ విద్యాసంస్థల వాహనాల భద్రతపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

Printed, Published, Owned by MANNE LAXMAN Printed at Saketh Publications, 312, Trinetra Complex, Sangareddy, Telangana 502001 Published from SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001 P.H: 9908123780, Email:navajyothinews@gmail.com, RNI no. TGTEL/25/A2372, EDITOR: MANNE LAXMAN